వాస్తు విజ్ఞాన చంద్రిక

పర్యవేక్షణ

''వాస్తు విశారద'' గోరస వీరబ్రహ్మాచార్యులు

రచన

''వాస్తు సమ్రాట్'' ''జ్యోతిష మహర్షి''

''దైవజ్ఞ'' గోరస వీరభద్రాచార్యులు, ఎం.ఏ.,

శ్రీ గాయత్రి జ్యోతిషాలయము

విషయానుక్రమణిక

1	ప్రకృతి - ప్రాణులు	1
2	మానవజాతులు - పరిసరాల ప్రభావము	3
3.	పరిసరాలు	7
4.	మన భూగోళం - దిక్కులు	10
5	భూమి - భౌతిక శక్తులు	13
6.	అంతరిక్షంలో - అక్షయపాత్ర	16
7.	సౌరశక్తి - వాస్తుశక్తి	18
8	వాస్తుపద విన్యాసము వైజ్ఞానిక విలువలు	21
9.	వాస్తుపద విన్యాస క్రమము	25
10.	వర్గులు వర్గాక్షరవిన్యాసము	29
11	వర్గాక్షరాలు - వాస్తు జ్యోతిష శాస్త్రంలో వాటి ప్రాముఖ్యత	31
12.	వర్గారూఢము	33
13.	క్షేత్రమునందలి దిశలు - వాటి భాగస్వామ్యము	36
14.	దిశలు - సూర్యకిరణాల ప్రభావం	40
15.	దిక్కులు - దిక్పతుల ప్రభావం	45
16	సత్యం - శివం - సుందరం	51
17.	ఆరా	54
18.	ఆకారంలో అద్భుతశక్తులు	57
19	గ్రహబలం? గృహబలం?	59
20.	గృహబలాన్ని ఏ విధంగా పరిరక్షించుకోవాలి?	63
21	గృహనిర్మాణ విధులు	66
22.	ఈశాన్యం	69

23.	దిశ ఇంటికి మాత్రమేనా? ప్రహారీ గోడలకు కూడా వర్తిస్తుందా?	71
24.	శాలా నిర్మాణ పద్ధతి	73
25.	ద్విశాలా నిర్మాణ క్రమవిధులు	84
26.	ఆయాది సాధన అవసరమా?	88
27.	పూర్ణ పదము - భిన్నపదము	90
28.	సూత్ర నిర్ణయం	91
29.	నవ వర్గు గణితక్రమము	93
30.	గృహ నిర్మాణంలో గల కొన్ని మెలకువలు	95
31.	ఉప గృహముల నిర్మాణం - నీటి పారుదలలు	100
32.	సెప్టిక్ లావెట్రీల నిర్మాణము	103
33.	గృహావరణయందలి చెట్లు - మొక్కలు	104
34.	గృహ నిర్మాణ ప్రయోజనము - గృహారంభ నియమాలు	105
35.	గృహప్రవేశ నియమాలు	108

ప్రకృతి - ప్రాణులు

'అగ్నీందు ద్యుమణిప్రభంజన ధరా నీరాంతరశ్యాయినీ
శక్తిబ్రహ్మహరీశవాసరముఖా మర్త్యాసురాత్మస్థితా
సృష్టిస్థావరజంగమ స్థితమహా చైతన్యరూపాచయా
యద్బీజ స్మరణేన సైవభవతీ ప్రాదుర్భవత్యంబకే

(త్రిపురసుందరీ మహిమ్నాస్తోత్రం)

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము అనే పంచభూతాలు తానుగా నిండి యున్నటువంటిన్ని, బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు, ఇంద్రుడు, సూర్యుడు మొదలగు దేవతలకు ఆత్మ స్వరూపిణి అయినటువంటిన్ని, సమస్త జగత్తునందలి స్థావర జంగమాది ప్రాణికోటికి బీజరూపిణియై మహా చైతన్య స్వరూపిణిగా భాసించుచూ బిందు రూపాత్మకమైన ఏ జగన్మాత, పరాశక్తి యనబడే ప్రకృతిమాత వ్యాపించి యున్నదో ఆపరా ప్రకృతికి నమోవాకములర్పించుకొనుచున్నాను.

ఈ పంచ భూతాత్మికమైన ప్రపంచములో అణువణువున నిండియుండి మహాశక్తి సంపన్నమైన ప్రకృతి స్వరూపిణియగు జగన్మాతయే ఈ దృశ్యమాన జగత్తునకు బీజము. సూక్ష్మ రూపముగానున్న మఱ్ఱి విత్తనమున మహా వట వృక్షము యే విధముగా యిమిడి యుండి అవసరమగునపుడు ఏ విధంగా వ్యాప్తి చెందుచున్నదో అట్లే ''ప్రకృతిశక్తి'' అనే బీజమునుండి ఈ దృశ్య మాన జగత్తంతయు ఆవిర్భవించి వ్యాప్తి చెందుచున్నది. ప్రకృతిమాత, కొన్ని అనుల్లంఘనీయమైన నియమములు ఆధారంగా చతుర్దశ భువనాలను పరిపాలించుచున్నది

పంచభూతాత్మికమైన ఈ దృశ్యమాన జగత్తునందలి యే పదార్థమైనా ప్రకృతి నియమాలను లవ లేశమైనా జవదాటలేదు. సమస్త జీవరాశులు ఈ కాల చక్రభ్రమణంలో పడి తిరుగుతూ చావుపుట్టుకలు, ఉచ్ఛ నీచలు పొందుతూనే ఉన్నాయి. ఈ దృశ్యమాన జగత్తు పంచభూతాత్మకమైనదని గదా తెలిసి కొంటిమి. భూమి, నీరు, నిప్పు గాలి, ఆకాశం అనబడే ఈ పంచభూతాలు అణు రూపాలుగా ఆవిర్భవించి అనేక రూపాలు ధరించి ఈ సృష్టి చక్రాన్ని నడిపిస్తున్నాయి. అయితే ఈ పంచభూతాత్మకమైన అణు సముదాయం అన్ని పదార్థాలయందు సమపాళ్ళలో కూడియుండవు. అందుచేతనే ఈ సృష్టిలో ఏ రెండు వస్తువులు ఒకే తీరున రూపొందవు. ఈ కోట్లాది మానవులలో ఏ యిరువురు మానవులూ ఆకృతిలోగాని రంగులోగాని, గుణగణాలలోగాని వ్యక్తిత్వంలోగాని ఒకేవిధంగా ఉండరు ఏరెండు పదార్థాల స్వరూపస్వభావాలు ఒకేవిధంగా ఉండవు ఉండజాలవు కూడా.

ఈ పంచభూతాత్మకమైన ప్రకృతియంతా అనిర్వచనీయమైన, అమూహ్యమైన, అనుల్లంఘనీయమైన కొన్ని కొన్ని నియమాలు ఆధారంగా కాల చక్రభ్రమణంలో బడి పరిభ్రమిస్తూ, సమస్త ప్రాణికోటులను ఆయా దేశ కాల పరిసరాల ప్రభావాలకు అనుగుణంగా ప్రభావితం చేస్తూ ఉంటుంది

ప్రకృతి అని పిలువబడే ఈ పరిసరాల (భావానికి, ప్రభావితంగాని ప్రాణి అంటూ ఉండదు మానవులందరూ పరిసరాల ప్రభావానికి దాసోహం అనవలసిందే. ఆ విధంగా పరిసరాల, ప్రకృతి ప్రభావానికి లోనైన మానవుని మనస్సుకూడా తదనుగుణంగా నడచు కొంటుంది. పశుపక్ష్యాదులు కూడా ప్రకృతి జన్య ప్రభావానికి లోనై ప్రవర్తిస్తాయి ఉదాహరణకు ఆకాశంలో మేఘాలు ఆవరించియుంటే నెమళ్ళు పరవశించి నాట్యం చేస్తాయి. సూర్యరశ్మి సోకగానే పద్మాలు వికశిస్తాయి. చంద్రుని కాంతికి కలువపూలు విచ్చుకుంటాయి ఇలా చాలా ఉదాహరణలు చెప్పవచ్చును.

★★★

మానవజాతులు – పరిసరాల ప్రభావము

ఆదిమ మానవ గణాలు అడవులలో తిరుగాడుతూ, కాలక్రమంలో వ్యవసాయం ముఖ్య వృత్తిగా స్వీకరించి, క్రొత్తగా సుఖ జీవనం సాగించడానికి నాంది పలికాయి. సుఖ జీవన విధానాలకు ప్రాతిపదిక స్థిరనివాసం. ఈ స్థిర నివాసానికి ప్రాతిపదిక వ్యవసాయం. ఈ పరస్పర ఆశ్రయ సాధనాలైన వ్యవ సాయము, స్థిరనివాసము అనేవాటికి జనపదాలు అనబడే గ్రామాలు ఆశ్రయం కదా. అట్టి జనపదాలు ఏర్పడడానికి, అవి అభివృద్ధి చెందడానికి, కొన్ని వృత్తులు ఆవిర్భవించాయి.

అందులో కమ్మరం, వడ్రంగి, పాత్రల నిర్మాణం, గృహ నిర్మాణం, ఆభరణాదులు నిర్మించేవృత్తి, ఈ ఐదు వృత్తులు ఆధారంగా వస్తునిర్మాణం, మట్టిపాత్రల నిర్మాణం మొదలైన ఇతర ఉపవృత్తులుకూడా రూపొందాయి ఈ గ్రామీణ వృత్తులు జనపదాలు సుఖ జీవనం సాగించడానికి ముఖ్యమైతే, కమ్మరం వడ్రంగం వ్యవసాయానికి ప్రాణం ఈ విధంగా పరస్పరాశ్రయభూతాలైన వృత్తులు జనపదాలుగా, గ్రామాలుగా ఏర్పడ్డాయి. పైన పేర్కొన్న వృత్తులన్నీ వంశపారం పర్యంగా ఎంతో అభివృద్ధిని సాధించాయి వృత్తిదారుల సంఘాలు ఆనాటి సమాజంలో మంచి పట్టును సాధించాయి.

ఆ విధంగా అభివృద్ధిని సాధించి యున్న ఆదిమానవ జాతులకు చెందిన కొందరు ఋషులు, అనేక శ్రమలకోర్చి, తపస్సులు చేసి, అతీంద్రియ శక్తులను సంపాదించారు ఆనాటికి తమకు అందుబాటులోనికి వచ్చిన భౌతిక శక్తులతో తృప్తిచెందక, ప్రకృతినే ప్రయోగశాలగా, తమకుగల అతీంద్రియ శక్తులే ప్రయోగ సాధనాలుగా, అనేక పరిశోధనలు చేశారు. తర తరాలుగా ఆనాటి వరకు తమకు అందిన విజ్ఞానం ఆధారంగా, ఆనాడు తమ పరిశోధనా ఫలితాలను బేరీజు వేసుకొని ,తాము తృప్తి పొందిన సిద్ధాంతాలు ప్రాతిపదికగా, కొన్ని శాస్త్రాలు ఆవిష్కరించారు అట్టి శాస్త్రాలలో ఖగోళ శాస్త్రం గణిత శాస్త్రం, జ్యోతిష శాస్త్రం, రసాయన శాస్త్రం, వైజ్ఞానిక శాస్త్రం, వాస్తు శాస్త్రం మొదలైనవి ముఖ్యమైనవి

పైన ఉదహరించిన శాస్త్రాలలో వాస్తు శాస్త్రం, క్రీస్తు శకం పదిహేను వేల సంవత్సరాలకు పూర్వమే, మొహంజదారో నాగరికత వ్యాప్తిలో ఉన్నవాటికే, మన దేశంలో వ్యాప్తిలో ఉన్నదనడానికి చారిత్రకాధారాలు ఉన్నాయి. మనము నివసించే ఈ భూగోళం మహాసముద్రాలు, భూఖండాలతో సహితంగా, అనంత విశ్వాంతరాళంలో గిర్రున తిరుగుతూ తేలి-యాడుతూ ఉంది ఈ భూగోళం 3550 కి మీ. వ్యాసం కలిగి వుంది. ఈ భూగోళానికి రెండు రకాలైన చలనాలున్నాయి. ఒకటి భూభ్రమణం, రెండవది భూపరిభ్రమణం.

ఈ భూగోళం బొంగరము వలె తన చుట్టూ తాను తిరుగుతూ ఉండడాన్ని భూభ్రమణం అంటారు. దీని వలన మనకు రాత్రింబవళ్ళు ఏర్పడుతుంటాయి. భూగోళం తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూతిరగడానికి భూపరిభ్రమణం అంటారు. భూమి, సూర్యుని చుట్టూ ఒకసారి తిరిగి రావడానికి 365.4 రోజులు, అనగా ఒక సంవత్సర కాలం పడుతుంది.

ఈ భూపరిభ్రమణ వేగం ఒక నిముషానికి 1100 మైళ్ళు. ఈ భూపరిభ్రమణ కారణంగా మనకు ఋతువులు ఏర్పడుతున్నాయి. మనము నివసించే ఈ భూగోళం, విశ్వాంతరాళంలో బొంగరం వలె 24 గంటల కాలంలో, తన చుట్టూ తాను తిరుగుతూ, నిముషానికి 1100 మైళ్ళ వేగంతో 365.4 రోజులలో, సూర్యగోళాన్ని ఒకసారి చుట్టివస్తుందని మనకు తెలుసు కదా. అయితే, ఈ భూగోళం యొక్క అక్షం 23 5 డిగ్రీలు వాలి ఉంది. ఆకారణంగా ఈ భూగోళం యొక్క అన్ని ప్రాంతాలలోని ఒకే విధమైన శీతోష్ణస్థితులు ఏర్పడక, వివిధ దేశాలలో, వివిధ కాలాలలో, వివిధ రకాలైన ఋతు ధర్మాలు కలుగుతున్నాయి. అంతేకాదు, సూర్యోదయాస్తమయ కాలాలలోకూడ చాలా వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయి. మన భారతదేశంలోనే ఒకచోట ఎండలు మండిపోతుంటే, మరోచోట వరదలువచ్చి పడుతున్నాయి.

మన భారతదేశంలో మధ్యాహ్నకాలం 12 గంటలైనదనుకొంటే, అదే సమయంలో, లండన్‌లో సా 6-30 నిలు అవుతుంది. అమెరికాలో రా 1-34 అవు

తుంది. ఈ విధంగా వివిధ దేశాలలో వివిధ శీతోష్ణస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ మార్పులన్నీ భూభ్రమణం మరియూ భూపరిభ్రమణమవే ప్రకృతి సిద్ధ మైన నియమాల వల్లనే గదా జరుగుతున్నాయి. ఆ నియమాలే మనకు వర ప్రసాదం.

ఈ విధంగా భూభ్రమణ, భూపరిభ్రమణములనే కారణంచేత, భూగోళం మీద, పర్యావరణ ప్రకృతి మరియు పరిసరాలయందలి అనేక మార్పులచేత భూమండలం మీద వివిధ దేశాలలో నివసించే మానవ జాతుల ఆకృతులు, గుణగణాలు, స్వభావాలు, శారీరకమైన రంగులు, ఒక్కొక్క దేశంలో ఒక్కో విధంగా రూపొందాయి. జీవరాసుల మీద, ప్రత్యేకంగా మానవజాతుల మీద, పరిసరాల ప్రభావం ఇంతింతనడానికి వీలులేనిది.

పరిసరాల ప్రభావం అనేది ప్రకృతిచేతిలో నిచాలా శక్తివంతమైన సాధనం. ఈ క్రింది విషయాలు గమనించండి.

ఈ భూగోళం మీద నాలుగింట మూడువంతుల భాగం మహాసముద్రంతో నిండి ఉంది. ఒక వంతు భాగంలో ఆసియాఖండం. ఐరోపాఖండం, ఆఫ్రికాఖండం, ఉత్తర అమెరికాఖండం, దక్షిణ అమెరికాఖండం, ఆస్ట్రేలియా ఖండం, అంటార్కిటికాఖండం అనే భూఖండాలుగా ఏర్పడి ఉంది. అందు ఆసియాఖండంలో ఒక ఉపఖండం అనడానికి తగిన లక్షణాలు మన భారత దేశం కలిగి ఉంది.

భారత దేశానికి తూర్పున బంగాళాఖాతం, దక్షిణాన హిందూ మహా సముద్రం, పడమర అరేబియాసముద్రం, ఉత్తరాన ఎత్తైన హిమాలయ శిఖ రాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఈ మన భారత దేశంలో వివిధ ప్రాంతాలలోని ప్రజలు వేరు వేరు భాషలు, వేరు వేరు సంస్కృతులు, వేరు వేరు ఆచార వ్యవహారాలు కలిగి ఉన్నారు. దీనికంతటకు కారణం పరిసరాల ప్రాకృతిక ప్రభావమే అని చెప్పక తప్పదు. గమనించండి

1. గోదావరి పరీవాహకప్రాంతం: ఈ గోదావరీ పరీవాహక ప్రాంతీయులు తపశ్శక్తి సంపన్నులు, ఆత్మజిజ్ఞాసాపరులు, సాత్వికగుణ సంపన్నులుగా గుర్తింపబడుచున్నారు. వీరుసత్వగుణప్రధానులు

2. కావేరీ పరీవాహక ప్రాంతం ఈ ప్రాంతీయులు సంగీత ప్రియులు, రజోగుణాధిక్యము కలవారు, లౌకికత్వముతోకూడిన ఆత్మజిజ్ఞాస కలవారు.

3. గంగానదీ పరీవాహకప్రాంతం· ఈ ప్రాంతీయులు శుద్ధ సత్వగుణ సంపన్నులు, తపోనిష్టాగరిష్టులు. ఆత్మజిజ్ఞాసయే వారి ఆదర్శం.

4. సీమాప్రాంతం. సరిహద్దుప్రాంతములైన కాశ్మీరము, పంజాబు, అస్సాము మొదలగు పర్వత సీమప్రాంతములలో నివసించేవారు, ధృడకాయులు, తమోగుణప్రధానులు, శౌర్యబల పరాక్రమసంపన్నులు, యుద్ధప్రియులు

సాముదాయకముగా· భారతీయులందరు భౌతికశక్తులకంటె ఆధ్యాత్మిక శక్తుల మీదే నమ్మకము కలవారు. లోక కళ్యాణమే పరమాదర్శముగా భావించువారు. అనేక భాషలు మతాలు సాంప్రదాయాలు, ఆచారాలు అవలంబిస్తున్న వారైనా భిన్నత్వంలోనే ఏకత్వం సాధించిన ఘనత భారతీయులకు దక్కింది. స్వాతంత్ర్య ప్రియత్వం భారతీయులకు ఆజన్మసిద్ధమైనది

ఆ విధంగానే యూరోపియనులకు, అమెరికనులకు, ఆఫ్రికనులకు ఆస్ట్రేలియనులకు అనేకవిధములైన భేదాలు ఉన్నాయి. ఆకృతులలోను, ఆచారాలలోను, ఆదర్శాలలోను, రంగులోను ఒక దేశవాసులకు, మరో దేశీయులకు పొంతన లేదు. ఈ అన్నింటికి ప్రాకృతికమైన కారణాలే అధికం.

ఈ విధంగా మనం భౌగోళిక ప్రాకృతిక శక్తులను బాగుగా పరిశీలిస్తే, పరిసరాల ప్రభావమే, ఈ మానవ జాతుల మధ్యగల తారతమ్య భేదాలకు ఆధారమని గుర్తించగలం. పరిసరాల ప్రభావం మానవుల మేధాశక్తి మీద తిరుగులేని ఆధిపత్యాన్ని సంపాదించి శాసిస్తుంది. ఆయా దేశవాసుల జీవిత సరళిని విజ్ఞాన వికాసాలను ప్రభావితం చేస్తుంది.



పరిసరాలు

పరిసరాలు రెండు విధాలు. సహజంగా ప్రకృతి సిద్ధమైన పరిసరాలు మరియు మానవ నిర్మితమైన పరిసరాలు. ఈ ప్రకృతిలో సహజంగా రూపొందిన సముద్రాలు, సముద్ర తీరాలు, నదులు, నదీతీరాలు, పర్వతాలు, గుట్టలు కోనలు, గుహలు, సరస్సులు, అడవులు, ఎడారులు, పచ్చిక బయళ్ళు, మైదానాలు మొదలైనవన్నీ సహజ ప్రకృతి పరిసరాలే.

ఈ సహజ ప్రాకృతిక పరిసరాలలో, పంచభూతాలకు చెందిన ఆధిపత్యం సమపాళ్ళలో ఉండకపోవచ్చును. కొన్ని చోట్ల ఈ పంచభూతాత్మికమైన భాగస్వామ్యంలో హెచ్చు తగ్గులు ఉండవచ్చును. ఆ కారణంచేత చిన్న చిన్న క్షేత్రాలలో, స్వల్పమైన పాంచ భౌతిక శక్తులు ఇమిడి ఉంటాయి. ఒక క్షేత్రంలో జలతత్వానికి ఆధిక్యత ఉంటే మరో క్షేత్రంలో అగ్నితత్వానికి ప్రాముఖ్యత ఉంటుంది. ఒకచోట వాయుతత్వానికి ఆధిక్యత ఉంటే యింకోచోట ఆకాశ తత్వానికి ప్రాముఖ్యత ఉంటుంది.

ఈ విధంగా ఆయా క్షేత్రాల ఉనికినిబట్టి, ఆయా పరిసరాల ప్రభావాన్నిబట్టి, ఆయా క్షేత్రాల భౌతిక శక్తులు, ఆయా క్షేత్రాలలో నివసించే ఇతర ప్రాణుల మీద తమ శక్తిని ప్రసరింపజేస్తూ ఉంటాయి. తత్కారణంగా, ఆయా ప్రాంతీయ క్షేత్రాలలో నివశించే మానవుల మనసులు, ఆయా పరిసరాల ప్రభావానికి లోనవుతూ ఉంటాయి.

నదీ తీరాలలో నివసించే మానవుల అభిరుచులు, అలవాట్లు, గుణగణాలు స్వభావస్వరూపాలు, ఆయా పరిసరాలకు అనుగుణంగా ఉంటాయి. అట్లే అడవులు, కొండలు కోనలు గల క్షేత్రాలలో నివసించేవారి అలవాట్లు, అభిరుచులు, గుణగణాలు స్వరూపస్వభావాలు, ఆయా ప్రజల జీవనవిధానం, ఆయా ప్రాంతీయ పరిసరాలకు అనుకూలంగా రూపొందుతుంది అనడంలో

ఏమీ సందేహం లేదు. ఆ విధంగానే సముద్ర తీర ప్రాంతాలు అడవులు గల క్షేత్రాలలో నివసించేవారి అభిరుచులు మొదలగునవి ఆయా పరిసరాలకు అనుగుణంగా రూపొందక తప్పదు. ఎడారులలో నివసించేవారు, తదితర క్షేత్రాలలో నివసించేవారు, పరిసరాను గుణంగా మారుతుంటారు. పిండితార్థం ఏమిటంటే ప్రాకృతికశక్తుల ప్రభావం మానవ మస్తిష్కం మీద ఆధిపత్యం వహించి, మానవుణ్ణి పరిసరాల ప్రభావానికి లోను చేస్తుంది. భూమి పైన జీవించే సమస్త చరా చర జగత్తు, పరిసరాల ప్రభావానికి లోనగుతూ ఉంటుంది

అయితే, లోక కళ్యాణమే పరమావధిగా భావించిన శాస్త్ర కర్తలైన కొందరు ఋషులు, ధర్మార్థకామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను సాధించడానికి, అనువైన జీవితం గడపడానికి తమ తమ అతీంద్రియ శక్తుల తోడ్పాటుతో కొన్ని సాధనాలు ఆవిష్కరించారు.

అట్టి సాధనాలలో, సహజ ప్రాకృతిక క్షేత్రాల మాదిరిగానే, మానవుడు సుఖ సంతోషాలతో జీవితం గడపడానికి వీలైన కృత్రిమ, ప్రాకృతిక క్షేత్రాలు ముఖ్యమైనవి ఈ క్షేత్రాలలో కూడా పంచ భౌతిక శక్తులు ఏ ఏ పాళ్ళలో మేళవించాలో ఆయా పాళ్ళలో పంచ భౌతిక శక్తులను ఆవిష్కరించి, మానవుల సుఖ జీవన విధానానికి దోహదపడేలా, తమ తమ అతీంద్రియ శక్తుల సహాయంతో కొన్ని నియమాలను సూత్రీకరించారు. ఆ నియమాల నిలయమే మన ' వాస్తుశాస్త్రము''.

అట్టి శాస్త్రకర్తలలో విశ్వకర్మ మయుడు, త్వష్ట కళ్యపుడు, భరద్వాజుడు భృగువు, మానసారుడు, అగస్త్యుడు మొదలగువారు సుప్రసిద్ధులు. వీరందరు లోకకళ్యాణమే పరమావధిగా ఈ శాస్త్రాలను రూపొందించి భావి తరాల వారికి అందించారు. అట్టి ఋషి శ్రేష్ఠులలో మయబ్రహ్మ సుప్రసిద్ధుడు మహాభారతంలో మయసభా భవన నిర్మాణంతో ఆతని కృత్రిమ ప్రాకృతిక పరిసరాల నిర్మాణ కౌశలం పరాకాష్ట పొందింది

అట్టి మయబ్రహ్మ రచనలలో, 'మయ మాయ', 'మయ జయము', అనునవి ఏ నాడో జర్మనీ దేశము చేరినవని లోకోపవాదం. మిగిలిన రచనలలో మయ మతం అనే వాస్తుశాస్త్ర గ్రంధం గొప్పది. దీనిని పాండిచ్చేరి ప్రభుత్వం ఫ్రెంచి భాషలో అచ్చు వేయించింది. మూల గ్రంథం నాగరీ లిపిలో ముద్రించారు. ఇందుగల వాస్తు శాస్త్ర విషయాలు ఆంధ్రులకు సమగ్రంగా అందుబాటుకు రాలేదు. ఈ మయ బ్రహ్మయే, ఈనాటి పంచాంగ రచనకు ప్రామాణిక గ్రంధమైన 'సూర్య సిద్ధాంతం' గ్రంధ కర్త. ఈనాటికీ పంచాంగ రచన సూర్య సిద్ధాంతం ఆధారంగా కొనసాగుతుంది.

మన వాస్తు శాస్త్రం ఆధారంగా, మానవులు సుఖంగా జీవించడానికి, చతుర్విధ పురుషార్థసాధనకు అనువైన కృత్రిమ, ప్రాకృతిక పరిసరాలుగల క్షేత్రాలు నిర్మించుకొనవచ్చునని తెలిసికొంటిమిగదా! అట్టి క్షేత్రాలకే ''వాస్తువు'' అని పేరు.

మనం ఏదైనా నగరం గాని గ్రామం గాని, ఆశ్రమం గాని, గృహం గాని నిర్మాణం చేయాలని తలపెట్టినపుడు ఆయా నిర్మాణయోగ్యమైన స్థలాన్ని దిశలకు సరిగా సవరించి, సరిహద్దులు సవరించినస్థలాన్ని ''వాస్తువు'' అంటారు. అట్టి వాస్తు క్షేత్రమునందు మానవ సుఖ జీవనానికి పాంచభౌతిక విలువలకు, అనువైన రీతిలో రూపకల్పనచేయాలి. అట్టి క్షేత్రాలనే మనం కృత్రిమ ప్రాకృతిక పరిసరాలని అంటాం. వీటి అన్నింటికి ఋషిప్రోక్తమైన భారతీయ వాస్తు శాస్త్రం ప్రాతిపదికగా వుంటుంది.



మనభూగోళం - దిక్కులు

పంచ భూతాలు సృష్టికి ఆధారభూతాలు. అయితే అందు మొదటిదైన భూగోళం వాస్తుకు ముఖ్యాధారం. మనం భూగోళం మీద నివసిస్తున్నాం కాబట్టి, ఆ భూగోళానికి సంబంధించిన కొన్ని ముఖ్య విషయాలు సంక్షిప్తంగా తెలుసుకొందాం.

ఈ భూమి దాదాపు సంపూర్ణ గోళం దాని వ్యాసం 7900 మైళ్ళు చుట్టుకొలత 25000 మైళ్ళు. భూమధ్యరేఖ వద్ద కొంచెం లావుగాను ధృవాల దగ్గర కొంచెం వత్తబడి ఉంటుంది. ఈ భూగోళానికి రెండు విధాలైన చలనాలు న్నాయని తెలుసు, అవి భూభ్రమణం, భూపరిభ్రమణం. భూమి గుండ్రంగా ఉన్నందువ ఎప్పుడైనాసరే భూమిలో సగ భాగానికి మాత్రమే సూర్యకిరణాలు ప్రసరిస్తాయి, ఆకాలం పగటికాలం. మిగతా సగ భాగం చీకటి. భూమి పడమర నుండి తూర్పు దిశగా తిరుగుతూ ఉన్నందు వలన సూర్యోదయం తూర్పున అయినట్లు సూర్యాస్తమయం పడమర అయినట్లు కనిపిస్తుంది. ఈ భూమి గోళాకారంగా ఉండడం వలన ఏదైనా ఒక స్థానాన్ని గుర్తించాలంటే ఏదో ఒక నిర్దేశం ఉండాలి. భూమి తనచుట్టూ తాను బొంగరంవలె తన మీద తిరుగుతు న్నందువలన అక్షం కొనలను ఉత్తర, దక్షిణ ధృవాలుగా శాస్త్రవేత్తలు గుర్తిం చారు. ఆ ధృవాలను ఆధారంగా చేసుకొని భూమి మీద కొన్ని ఊహా రేఖలను గీసుకొని, భూమి మీద ఏస్థానాన్నయినా గుర్తించడానికి సులభ మార్గం గ్రహిం చారు. ఈ ఉత్తర, దక్షిణ ధృవాల దగ్గర భూగోళం కొద్దిగా వొక్కబడి ఉంటుం దని తెలుసు. అయితే భూగోళం యొక్క ఉత్తర ధృవం దగ్గర నిలుచుండి తల పైకెత్తి ఆకాశంలోకి చూస్తే ఆకాశంలో కదలకుండా దిగొట్టిన మేకు వలె తళ తళలాడుతూ కనిపించేదే ధృవతార. ఆ ధృవతార ఆకర్షణ శక్తికి లోనై నిముషా నికి 1100 మైళ్ళ వేగంతో ఈ భూగోళం అండాకారమైన ఒక నిర్ణీత కక్ష్యలో సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నప్పటికి భూగోళం యొక్క ఉత్తర ధృవ ప్రాంతం, ఉత్తరాకాశంలో ధృవతార పరస్పరాశ్రయాలై ఉంటాయి. అంటే

అన్ని ఋతువులలోనూ, అన్ని వేళలా, ఉత్తర ధ్రువం దగ్గర ధ్రువతార నడినెత్తి మీద ప్రకాశిస్తూనే ఉంటుంది. ఆ విధంగా భూగోళానికి ఖగోళంలో కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో ఉన్న ధ్రువ మండలానికి, ఆ విధమైన విడదీయరాని సంబంధం ప్రకృతి సిద్ధంగా ఉంది. అంటే ధ్రువ నక్షత్రానికి భూగోళానికి అంతటి మహత్వ పూర్ణమైన సంబంధం ఉన్నది.

భూగోళం మీద, భూమధ్యరేఖా ప్రాంతంలో నిలబడి, ఖగోళం వైపు దృష్టి సారిస్తే ఉత్తరాకాశంలో సప్తర్షి మండలం దిగువన, రాత్రి కాలంలో ఏ సమయంలో చూసినా ధ్రువతార ఒకేచోట ఉంటుంది. కాబట్టి ఈ భూగోళానికి ధ్రువతార కనిపించే దిశ ఉత్తర దిశ అని మనం గుర్తించగలం.

ఈ రేఖాంశాలను కూడా లెక్కించడానికి ఒక ప్రారంభం కావాలి. అందుకుగాను దానికి వ్యతిరేక దిశ ఖచ్చితంగా దక్షిణ దిశ అగును. ఈ విధంగా భూగోళానికి ప్రకృతి సిద్ధమైన ఉత్తర దక్షిణ దిశలు అతి తేలికగా గుర్తించ గలము

ఈ భూగోళం మీద మనకు కావలసిన చోటును గుర్తించడానికి వైజ్ఞానికులు కొన్ని ఊహా రేఖలు గుర్తించారు. ఉత్తర దక్షిణ ధ్రువాలకు మధ్యగా గీసిన ఊహారేఖ భూమధ్యరేఖ. భూమధ్య రేఖకు ఉత్తరంగా 23.50 డిగ్రీల దూరంలో గీసిన గీత కర్కాటకరేఖ, దక్షిణంగా 23.50 డిగ్రీల దూరంలో గీసినరేఖ మకర రేఖ. ఈ విధంగా భూమధ్య రేఖ నుండి ధ్రువాల వరకు గీసిన సమాంతర రేఖలను అక్షాంశ రేఖలని పిలుస్తారు.

ఆ విధంగానే భూమి చుట్టూ భూమధ్యరేఖను ఖండిస్తూ లంబంగా ధ్రువాలగుండా గీసిన ఊహా రేఖలను రేఖాంశాలని అంటారు ఈ విధంగా భూమధ్య రేఖపై 360 డిగ్రీల రేఖాంశాలున్నాయి అయితే ఈ రేఖాంశాలను కూడా లెక్కించడానికి ఒక ప్రారంభం కావాలి.

కాబట్టి లండన్ లోని గ్రీనిచ్ గ్రామం మీదుగా పోయే రేఖాంశాన్ని సున్నా రేఖాంశగా తీసుకొన్నారు గ్రీనిచ్ రేఖాంశానికి తూర్పుగా 180 డిగ్రీలు పడమరగా 180 డిగ్రీలు లెక్క కట్టారు.

భూమి యొక్క ఉత్తర దక్షిణ ధృవాల ఆధారంగా, ఉత్తర దక్షిణ దిశలు ఎట్లు సులువుగా గుర్తించగలిగామో అట్లే ఈ రేఖాంశాలు ఆధారంగా భూగోళం మీద మొదట ఏ దిశలో సూర్యోదయం అవుతుందో ఆ దిశ తూర్పు దిక్కుగాను దానికి వ్యతిరేకమైన దిశ పడమర దిశగాను నిర్ధారణ అవుతుంది. భూమి పశ్చిమం నుంచి తూర్పునకు తిరుగుతూ ఉన్నందున తూర్పున గల రేఖాంశం మీద సూర్యోదయం అవుతుంది. భూమి తన చుట్టూ తాను ఒక పర్యాయం తిరగడానికి 24 గంటల కాలం పడుతుంది

కాబట్టి ఒక్కొక్క రేఖాంశాన్ని దాటడానికి 4 నిముషాల కాలం పడుతుంది ఈ విధంగా భూగోళం మీద భూమి గోళాకారంలో ఉన్నప్పటికి మనం కోరిన క్షేత్రంలో దిశలు ఏ విధంగా గుర్తింపగలమో తెలుసుకొంటిమి నాలుగు దిశలు గుర్తించ గలిగినపుడు నాలుగు విదిక్కులు సులువుగా గుర్తించ గలం.

అయితే వాస్తు శాస్త్రానికి సంబంధించినంత వరకు మరొక ప్రశ్న ఉదయిస్తుంది ఉదాహరణకు ఒకచోట 500 చదరపు గజముల స్థలం చతురస్రాకారపు క్షేత్రం ఉంది. దానికి తూర్పు దిశగా అంతే విస్తీర్ణముగా గల మరొక క్షేత్రం ఉన్నది. ఒకటవ క్షేత్రానికి తూర్పు రెండవ క్షేత్రానికి పడమర అగును. అది ఎలా సంభవిస్తుంది అన్నది ప్రశ్న

ఈ భూగోళం మీద మానవుడు ఏ బిందువుపై నిలబడి చూచినా ఆ బిందువునకు మాత్రమే నాలుగు దిశలు, విదిశలు, గుర్తించడం వైజ్ఞానిక పద్ధతి. కాబట్టి మొదటి క్షేత్రానికి మధ్య బిందువు దగ్గర నిలబడి, ఆ క్షేత్రపు తూర్పు రేఖ నిర్ధారించినపుడు రెండవ క్షేత్రానికి మధ్య బిందువునందు నిలుచున్నవానికి మొదటి క్షేత్రపు తూర్పురేఖ రెండవ క్షేత్రమునకు పడమర దిశరేఖగా గుర్తించ గలడు ఈ సత్యం అందరకు స్పష్టము. కావున భూమి గోళాకారంగా విశ్వాంతరాళంలో ఎంతో వేగంతో పయనిస్తున్నప్పటికీ భూగోళం మీద మనం కోరుకొన్న బిందువు దగ్గర నాలుగు దిశలు విదిశలు గుర్తించగలరు. ఇదియే వైజ్ఞానిక పద్ధతి.



భూమి - భౌతిక శక్తులు

భూగోళం దాని ఆకారాదుల గురించి కొంతవరకూ తెలిసికొన్నాం. అధర్వణ వేదంలోని పృథ్వీసూక్తంలో, భూగోళానికి సంబంధించిన అనేక వైజ్ఞానిక రహస్యాలు వర్ణింపబడి ఉన్నాయి. కొన్ని కోట్ల సంవత్సరాలకు పూర్వం సూర్యగోళం నుండి విడి పడి, ఆ సూర్యుని ఆకర్షణ శక్తి నుండి తప్పించుకొని, సూర్యగోళానికి ఉపగ్రహంగా మారిన ఒక అగ్నిగోళం ఈ భూగోళం. ఆ అగ్నిగోళం అనేకవేల సంవత్సరాల వరకు విశ్వాంతరాళంలో సూర్యుని చుట్టూ తిరుగుతూ తిరుగుతూ కొంత ఉష్ణశక్తిని కోల్పోయి చల్లబడింది. ఆ విధంగా ఈ భూగోళం నెమ్మది నెమ్మదిగా చల్లబడుతూ ఉంటే ఆ భూగోళ గర్భంలో ఉన్న బరువైన ఇనుము, నికలు మొదలైన లోహ ఖనిజ ద్రవాలు భూకేంద్రం యొక్క గురుత్వాకర్షణ శక్తికి లోబడి, అనగా ''ఫోర్స్ ఆఫ్ గ్రావిటీకి'' లోబడి, భూగోళ మధ్యకేంద్రానికి చేరుకొన్నాయి. తేలికైన రాళ్ళు రప్పలు, ధూళి ఉపరితలానికి చేరి కుదుటపడి దృఢంగా కూడి ఉండడంవల్ల భూమి పై పొరగట్టిపడి అరణ్యాలు వనాలు, సముద్రాలు మొదలైన ప్రకృతి స్వరూపం రూపొందడానికి ఆధారమైనది. ఋగ్వేదంలోని ఈ సూక్తం చూడండి

''శిలా, భూమి, రశ్మి, పాంసు, సాభూమి సంధృతాధృతా
తస్యై హిరణ్యవక్షసే పృథివ్యాఅకరంనమ:''

పై మంత్రం, భూమి యొక్క బాహ్య స్వరూపాన్ని వివరిస్తుంది. భూకేంద్రంలో ఏర్పడిన వివిధ లోహ ఖనిజ ద్రవాల కూడిక, అంతర్గత ఉష్ణ శక్తికి లోబడి, కుత కుత లాడుతూ, భూగోళం యొక్క ఆత్మభ్రమణ వేగంచేత అనేక వత్తిళ్ళకు లోనై బాగా మధింపబడి సుళ్ళు తిరుగుతూ అనంతమైన విద్యుత్ప్రవాహాలను విరజిమ్మబడుతూ ఉంటుంది. ఆ విద్యుత్ప్రవాహాల నుండి అయస్కాంత క్షేత్రాలు ఆవిర్భవిస్తాయి. ఆ అయస్కాంత క్షేత్రాలనుండి ప్రాణుల

మనుగడకు అవసరమైన జీవశక్తి భూమి యొక్క ఉపరితలం మీద ఎల్లెడల విరజిమ్ముతూ ఉంటుంది.

ఆ జీవశక్తి ప్రభావం చేతనే అరణ్యాలు, వనాలు, సమస్త జీవరాశులు అవతరించాయి. సమస్త జడ చేతనాలకు ఆ జీవశక్తియే పుట్టిల్లు భూమాతకు కూడా ఆ జీవశక్తియే ఆత్మ శక్తి.

ఇక భూగోళానికి గల ఆకర్షణ శక్తి, పైతృకంగా సూర్యగోళాన్నుండి సంక్రమించింది. ఈ భూగోళం పై పొర గట్టిబడడంతో యేర్పడిన ధాతువుల నుండి, ఖనిజాల నుండి ఇతర మూలకాల నుండి కూడ ఈ ఆకర్షణశక్తి వృద్ధిపొంది భూమ్యాకర్షణ శక్తిగా రూపొందింది. ఈ భూమ్యాకర్షణ శక్తి లేకపోతే మనం ఈ భూమి మీద స్థిరంగా జీవించే అవకాశం లేదు. గాలిలో యేమూలకో ఎగిరిపోయేవాళ్లం.

ఈ భూమండలానికిగల బలీయమైన అయస్కాంత క్షేత్రాల ప్రభావం చేత ఈ భూగోళం చుట్టూ కొన్ని మైళ్ళ వరకు ఈ అయస్కాంత శక్తి వ్యాపించి ఉంటుంది. అంతేగాక భూగోళపు ఉత్తర దక్షిణ ధృవాల మీదుగా అయస్కాంత వలయాలు నిరంతరం ఎడతెగక పరిభ్రమిస్తూ ఉంటాయి. ఈ అయస్కాంత వలయాల ప్రభావం భూమి మీద నివసించే జీవరాసుల మీద అమితంగా ఉంటుంది. ఈ అయస్కాంత వలయాల తీరుతెన్నులకు జీవరాశుల జీవిత చక్రాల గమనాలకు విడదీయరాని సంబంధం ఉన్నదని ఆధునిక వైజ్ఞానికులు కూడా అంగీకరిస్తున్నారు

అప్పడపుడు సూర్య గోళంలో చెలరేగే తుఫానులకు, ఈ భూగోళం మీద విస్తరించియున్న అయస్కాంత మండలాలు అస్తవ్యస్తంగా తయారవుతాయని, ఆ రోజులలో భూమి మీద మానవ సమాజాలు మానసికంగా అనేక వత్తిళ్ళకు గురియవుతున్నాయని, సముద్రాలు పొంగి ఉప్పెనలు ఉపద్రవాలు పుడుతున్నాయని, భూకంపాలు, యుద్ధాలు సంభవిస్తున్నాయని ఆధునిక

వైజ్ఞానికులు ప్రకటిస్తున్నారు. ఈ అయస్కాంత శక్తి చేతనే భూమి మీద కట్టడాలు సురక్షితంగా ఉంటున్నాయని, ఈజిప్టు పిరమిడ్లే ఇందుకు సాక్ష్యమని అంటున్నారు.

ఈ అయస్కాంత వలయాల ప్రభావం ఉత్తర దిశకు తల పెట్టి నిద్రించే మానవుల మెదడు లోని విద్యుత్తరంగాలపై ఉంటుందని, అంతే కాకుండా శరీర ద్రవాలపై కూడా ఈ అయస్కాంత వలయాల ప్రభావం ఉంటుందని డా శారదా సుబ్రహ్మణ్యంగారు ది 5-01-1980న రాంచీలో జరిగిన సైన్సు మహాసభలో పరిశోధనా వ్యాసం సమర్పించారు. అంతేకాదు, ఈ అయస్కాంత ప్రభావాల హెచ్చు తగ్గుల వలన మానవుల మనస్సులలో సందిగ్ధమైన ఆలోచనలు, మానసిక ఉద్రిక్తతలు, అనారోగ్యం చోటుచేసుకుంటాయని ప్రతిపాదించారు. ఈ విషయాలన్నీ మన శిల్ప ఋషులు వేలాది సంవత్సరాలకు పూర్వమే గ్రంధస్థం చేసి ముందు తరాలకు అందించారు. నిర్దిష్టమైన ఉత్తర దిశను గుర్తించి ఆ ఉత్తర దక్షిణ దిశలకు అనుగుణంగా కట్టడాలు నిర్మించుకోవాలని ఉద్బోధించారు. కానీ మనం ఆ విషయాన్ని మూఢ నమ్మకంగా త్రోసిపుచ్చుతున్నాము.

మన ఆధునిక ఇంజనీర్లు ఈ దిక్సాధనా సిద్ధాంతాన్ని అసలు - సరైన ఉత్తర దక్షిణ దిశలకు అనుగుణంగా కట్టడాలను నిర్మించాలనే సిద్ధాంతాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు.

కాబట్టి భూమికి గల ఈ భౌతిక శక్తుల విలువలను గుర్తించి నిర్మాణ కార్యాలు చేపట్టాలని మన భారతీయ ఋషుల విజ్ఞానాన్ని మనం వినియోగించుకోవాలని సిద్ధాంతులు ముఖ్యంగా భారతీయ ఇంజనీర్లను కోరుతున్నారు



అంతరిక్షంలో - అక్షయపాత్ర

ఈ దృశ్యమానచరాచర జగత్తునందలి జడచేతనాలన్నింటికి ప్రాణదాత సూర్యుడు. సూర్యుడు లేని జగత్తు శూన్యమే ఆ సూర్యుడు ఎట్టివాడనగా

సూర్యయేవ త్రిలోకస్య మూలం పరమ దైవతం
ఆదిత్యాజ్జాయతేవృష్టిః వృష్టేరన్నం తతఃప్రజా
సూర్యాత్ ప్రసూయతే సర్వం తస్మిన్నేవప్రలీయతే

అనే భవిష్య పురాణ వాక్యాన్ననుసరించి, ఈ సమస్త చరా చర జగత్తునకు సూర్యుడే ఆధార భూతమైనవాడు సూర్యుని వలన మేఘాలు ఆవిర్భవిస్తున్నాయి. మేఘాల వలన వర్షాలు కురుస్తున్నాయి వర్షాల వలన భూమండలం సస్యశ్యామలమై పంటలు పండుతున్నాయి. అడవులు చెట్లు చేమలు పండ్లు కూరలు సమస్త పదార్థాలు మనకు లభ్యమౌతున్నాయి. ఆహార పదార్థాలు అనే అన్నం వలన ప్రాణులు అభివృద్ధి పొందుతున్నాయి. చివరగా ఈ సమస్త జగత్తు ఆ సూర్య భగవానునియందే లీనమౌతున్నది. సూర్యుడు లేని ఈ జగత్తు సర్వ శూన్యం అని గ్రహించగలం

ప్రపంచంలోని అన్ని దేశాలలోను, అన్ని మతాలలోను, ఏదో ఒక రూపంలో సూర్యారాధన ఉంది. బైబిల్, ఖురాన్, జెంట్ అవేస్తా వంటి మత గ్రంథాలలోనుసూర్యునిగురించిప్రశంసలున్నాయి అమెరికాకుచెందినమెక్సికో దేశంలో కూడా సూర్య దేవాలయం ఉంది. జపాన్ వైనా దేశాలలో కూడా సూర్య దేవుని ఆరాధించేవారున్నారు భారతీయులలో చాలా మంది సూర్య భగవానుని దర్శించ కుండా మంచినీళ్ళు కూడాత్రాగని వారున్నారు. గాయత్రీ మంత్రం సూర్య దేవతాత్మకమైనదే రాత్రి కాలమంతా గాఢాంధకారంలో మునిగియున్న లోకానికి ఉషఃకాలంలో అనంత చైతన్యమైన వెలుగు నింపి ప్రాణులలో నూతనచైతన్యాన్ని పాదుకొల్పి నిత్య జీవనరథం ముందుకు సాగడానికి ఆధారభూతమైన సూర్యుణ్ణి ఆరాధించనివారుండరు.

అట్టి జగత్కర్త విశ్వకర్మ అయిన సూర్యభగవానుని భౌతిక రూపాన్ని గూర్చి పరిశీలిద్దాం.

సూర్య గోళవ్యాసం ఇంచుమించుగా 8,64,000 వేల మైళ్ళు. ఈ ఆదిత్యుడు స్వయంభువు. అంతరిక్షంలో ఆవిర్భవించిన అక్షయపాత్ర వంటి ప్రత్యక్ష దైవం. గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ప్రతి సంవత్సరం అక్షయపాత్ర నుండి 50 లక్షల కోట్ల మెగావాట్లకు పైగా శక్తి దశ దిశలకు వెదజల్లబడుతూ ఉంటుంది. కానీ ఆశక్తి భూమికి 47 వంతులు మాత్రమే చేరుతుంది. అయితే భూమికి చేరే శక్తి 25వేల భాగాలు అనుకొంటే అందులో కేవలం ఒక్క భాగం శక్తినిమాత్రమే మనం వినియోగించుకొంటున్నా మని వైజ్ఞానికులు అంచనా వేశారు. ఈ సౌర శక్తిని వినియోగించుకోవడంలో మనం ఎంతగా వెనుకబడియున్నామో ఊహించండి. ఈ సౌర శక్తి కామధేనువు లాంటిది. అధునిక కాలంలో సౌర శక్తి ఉపయోగించని వైజ్ఞానిక రంగంలేనే లేదు. ఈ సౌర శక్తి చేత వైజ్ఞానికులు అనేక అద్భుతాలు చేయిస్తున్నారు. వైర్‌లెస్‌లు, టీవీలు, ట్రాన్సిస్టర్లు, నీటిని శుద్ధి చేసే యంత్రాలు, ఎలక్ట్రానిక్ రంగంలో కూడా అనేక విధాలుగా ఈ సౌరశక్తి వినియోగపడుతుంది. ఆఖరుకు మనం నిత్యం ఉపయోగించే కాలుక్యులేటరు కూడా సౌర శక్తిని వినియోగి స్తున్నాం. వైద్యరంగంలోనూ, స్పుత్నిక్ రంగంలోను, ఈ సౌర శక్తి బాగా వినియోగ పడుతుంది. సామాన్య గృహిణి కూడా వంటకు, దీపాలకు, సౌర శక్తిని వాడుకొంటుంది. సౌర శక్తితో పని చేసే విద్యుత్ యంత్రాలు, జల యంత్రాలు వినియోగిస్తున్నారు. ఈ విధంగా సూర్యుడు వేయి విధాలుగా మనకుపయోగపడుతున్నాడు. అందుచేతనే మన ఋషులు సూర్యుణ్ణి 'సహస్రాంశా' అని కీర్తించారు.

ఈ సౌర శక్తిని గూర్చి భారతీయ శిల్ప ఋషులు, వేదాలలోను, పురాణాలలోను విపులంగా వివరించారు. ఉదా: మైసూరులో లభించిన భార ధ్వాజ ''విమాన నిర్మాణ శాస్త్రంలో'' సౌర శక్తితో నడిచే విమాన నిర్మాణ విధానం వర్ణించబడి ఉంది. అయితే ఈ నాటి పాశ్చాత్య వైజ్ఞానిక వెలుగుల్లో, కళ్ళు మిరుమిట్లు గొలిపిన భారతీయ వైజ్ఞానికులకు, మనకూ ఒక నిర్దుష్ట మైన, ప్రణాళికా బద్ధమైన విజ్ఞాన శాస్త్రాలున్నాయని నమ్మకం కలగడం లేదు. భారతీయ ప్రాచీన విజ్ఞానమంతా మూఢ నమ్మకంగాను, పుక్కిట పురాణం గాను తోస్తుంది.

సౌరశక్తి - వాస్తుశక్తి

ఈ రోజులలో విజ్ఞానశాస్త్రవేత్తలంతా సౌరశక్తి వినియోగాన్నిగూర్చి విశేష ప్రచారం చేస్తున్నారు. సౌర శక్తి అంటే సూర్య కిరణాల నుండి మనకు లభించే శక్తి అని తెలుసుకున్నాం.

ఆ సౌర శక్తి అనేక రంగాలలో అనేక రూపాలలో మనకు ఉపయోగ పడుతుంది. సౌర శక్తి అనేది ఒక అక్షయపాత్ర. మనం ఎంత కాలం ఎన్ని విధాలుగా ఉపయోగించు కొన్నా ఆ సౌర శక్తి నిధులు తరగవు ఆ సౌర శక్తి వరప్రసాదంలో ప్రాణ వాయువు అనే ఆక్సిజన్ ఒకటి. అనుక్షణం సమస్త ప్రాణికోటికి ప్రాణవాయువు (ఆక్సిజన్) అత్యవసరం. ప్రాణవాయువు పీల్చనిదే ఏ ఒక్క ప్రాణీ రెప్ప పాటుకాలమైనా జీవించదు. అలాటి ప్రాణవాయువు సూర్యకిరణాల నుండి మాత్రమే మనకు లభిస్తుంది. సృష్టిలో మరి ఏ యితర పదార్థాల నుండి లభించదు. మనం లోపలికి పీల్చుకొనే గాలిలో తేలియాడే అణు సముదాయం సూర్య కిరణాల నుండి లభ్యమయ్యే ప్రాణవాయువును తమలోనికి పీల్చుకొని నిలువ చేస్తాయి. మనం శ్వాసను లోనికి పీల్చు కొనేటప్పుడు ఆ ప్రాణవాయువుతో కూడిన అణు సముదాయం మన ఊపిరి తిత్తుల లోనికి ప్రవేశించి శరీరాన్ని శక్తివంతం చేస్తుంది. ఈ సూర్య కిరణాలు ప్రాణవాయువునేగాక ఎన్నో అమూల్యమైన ఔషధగుణాల లవణాలు, విటమినులు, పోషకశక్తులుగల అల్ట్రావైలెట్‌కిరణాలు ఇన్‌ఫ్రారెడ్‌కిరణాలనుకూడా విడుదల చేస్తాయి. ఈ కిరణ సమూహాలు మానవ జాతి మనుగడకు ఇతర ప్రాణులు వర్ధిల్లడానికి ఎంతో అవసరమైనవి. అయితే ఈ విధమైన సౌర శక్తి, వాస్తు శక్తిగా యేవిధంగా రూపాంతరం చెందుతుందో పరిశీలిద్దాం.

మయవిశ్వకర్మ మతానుసారం మానవులు తమకు నివాస యోగ్యంగా భావించి యెంచుకొన్న భూమికి ''వాస్తువు'' అని పేరు. అట్టి వాస్తువునకు అధి దేవత వాస్తు పురుషుడు. వాస్తు పురుషుడనగా సూర్యుడేనని శాస్త్రాలు చెపుతున్నాయి.

''విశ్వకర్మా సహస్రాంశోః'' అనగా విశ్వకర్మయే సూర్యుడని శాస్త్ర ప్రమాణం. ఆ విధంగానే ''వాస్తోష్పతిర్విశ్వకర్మా'' అనగా విశ్వకర్మ అనగా వాస్తు పురుషుడనియు, వాస్తు పురుషుడనగా సూర్యుడనియు శాస్త్రాలు వివరిస్తున్నాయి. వాస్తు పురుష గమనం కూడా సూర్య గమనాన్నీ అనుసరించే ఉంటుంది.

అతీంద్రియ శక్తి సంపన్నులైన విశ్వకర్మాది శిల్ప ఋషులు అనేక ఖగోళ పరిశోధనలు జరిపి యేయే కాలములయందు సూర్యకిరణ ప్రసారం యేయే రీతులలో జరుగుతుందో ఆయా కాలములందు ప్రసరించే సూర్యకిరణాల నుండి వెలువడే కాంతి తరంగాల ప్రభావం తరంగ ప్రసారదైర్ఘ్యం ఎట్టిదో, యే గుణాలు కలిగి ఉంటుందో, ఆ విధానమంతా వాస్తు పురుష స్వరూపం పేరుతో గుప్త పరచి మనకు అందించారు. కాబట్టి సూర్య కిరణ ప్రసార జన్యమైన సౌరశక్తి''యే భూమి అనబడే వాస్తువు నందు వాస్తు పురుష స్వరూపముగు వాస్తుశక్తిగా రూపాంతరం చెందుతూ ఉంది. పిండితార్థమేమనగా ఈ భూమి అని పిలువబడే ''వాస్తువును'' వాస్తు క్షేత్రమందలి గాలిని సూర్య కిరణజన్యమైన శక్తి, శక్తివంతం చేస్తుంది. ఈ విధంగా సౌరశక్తి వాస్తుశక్తిగా రూపాంతరం చెందుతూ ఉంది భూమి అనగా గృహాది నిర్మాణాలకు దిక్సాధనాది పరిశోధన ద్వారా శుద్ధపరచి స్వీకరించిన క్షేత్రం. ఈ క్షేత్రాన్నే వాస్తువు అని గ్రహించాం. అట్టి క్షేత్రానికి వాస్తు పురుషుడు అధి దేవత. అయితే ఆకాశంలో వెలుగొందే వాస్తు పురుష స్వరూపుడైన సూర్యునికి భూమండలం మీద గల వాస్తువు అనే

పేరు గల క్షేత్రానికి అనుసంధాన మేవిధంగా యేర్పడుతుంది? అంటే కిరణ ప్రసారంచేత అని ఋజువైనది. ఈ ఆకాశ మండలం గల సూర్యుడనే వాస్తు పురుషునకు భూమండలం మీద గల వాస్తు పురుషునకు బింబ ప్రతిబింబ న్యాయం వర్తిస్తుంది. అందు చేతనే వారిద్దరికి అభేదం చెప్పబడినది. ఉదా: ఒకచోట ఒక నీటితో నిండిన వంద కుండలు వరుసలుగా పేర్చబడి ఉన్నాయని భావించండి. ఆకాశంలో వెలుగులు విరజిమ్మే సూర్య భగవానుడు ఆ కుండలయందు సంపూర్ణ సూర్యబింబముగా ప్రకాశిస్తాడు. పై విధంగానే ఆకాశంలో వెలుగొందే వాస్తు పురుషుడు భూమండలం పై వాస్తు క్షేత్రంలో వాస్తు పురుష స్వరూపుడుగా అంతర్లీనుడై వ్యాపించియుండి వాస్తు శక్తులను ప్రసాదిస్తాడు.

ఈ వివరణనుసరించి ఆకాశంలో యున్న వాస్తు పురుష స్వరూపుడైన సూర్య భగవానుడు భూమండలం మీద ''వాస్తుక్షేత్ర'' స్వరూపుడైన వాస్తు పురుషునికి తన బలీయము, అద్భుత శక్తిసమన్వితమైన సూర్య కిరణాలనబడే హస్తాల ద్వారా అద్భుత శక్తులను అందిస్తున్నాడు.

★★★

వాస్తు పద విన్యాసము వైజ్ఞానిక విలువలు

భూమండలానికి సంబంధించినంత వరకు సూర్యుడే ప్రత్యక్ష దైవం. వాస్తు శాస్త్రానికి అధిదేవత వాస్తు పురుషుడు. వాస్తు పురుషుడే సూర్యుడని, సూర్యుడే వాస్తు పురుష స్వరూపుడని మన శాస్త్రాలు చెపుతున్నాయి. వాస్తు పురుష గమనం కూడా ఈ విషయాన్నే బుజువు చేస్తుంది

మార్తాండరూఢరాశౌ వినిహితచరణ స్తన్మద న్యస్తమూర్ధా
వామేపార్శ్వే శయానో భ్రమతిసపరితః పూరుషో వాస్తురూపః
(విద్యామాధవీయం)

అనగా వాస్తు పురుషుడు సూర్య గమనాన్నానుసరించి సూర్యుడున్న రాశి యందు పాదములుంచి దానికి యేడవ రాశియందు శిరస్సు నుంచి యెడమ ప్రక్కగా శయనించినాలుగు దిక్కులయందు పరిభ్రమించునని భావము కాబట్టి ఈ వాస్తు పురుషపరిభ్రమణ విధిని బట్టి విచారించిన సూర్యునకు వాస్తు పురుషునకు అవినాభావ సంబంధమున్నదని రూఢి అవుతుంది సమస్త వాస్తు శాస్త్రాలు సూర్య గమనాన్ని ప్రాతిపదికగా గ్రహించి అందలి నియమాలు వైజ్ఞానిక విలువ గలవిగా రూపొందించారు. వాస్తు శాస్త్రానికి సూర్య ప్రతినిధి యైన వాస్తు పురుషుడు అధిష్టానదేవత కాగా సూర్యకిరణాల ద్వారా మనకు లభించే సౌర శక్తిని మానవులు ఎంత పుష్కలంగా వినియోగించుకోగలరో అంత పుష్కలంగాను వినియోగించుకొనే నిమిత్తం అతీంద్రియ శక్తి సంపన్నులైన మయ, విశ్వకర్మ కశ్యపాది మహర్షులు ఒక మహిమాన్వితమైన ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళికయే ''వాస్తు పద విన్యాస పద్ధతి ''.

సమస్త నిర్మాణ కార్యాలకు ఈ 'వాస్తు పద విన్యాస పద్ధతి' మూలాధారం. ఈ ప్రణాళికకు ప్రాతిపదిక భూభ్రమణం, భూ పరిభ్రమణం అనే భూ చలనాలు ఈ చలనాల ఆధారంగానే యేయే కాలాలలో యేయే సమయాలలో సూర్య కిరణాలు యేయే విధమైన శక్తులను విడుదల చేస్తుంటాయో ఆ

శక్తులను ఆయా నిర్మాణ క్షేత్రాలు పై నుదహరించిన వాస్తు పద విన్యాస పద్ధతి ద్వారా గ్రహించి అందు నివసించే ప్రాణులకు అందజేస్తాయని గుప్త రూపంలో మన శిల్ప ఋషులు వివరించారు. కాబట్టి ఈ ''వాస్తు విన్యాస పద్ధతి''కి సౌరశక్తికి ఏవిధమైన అవినాభావ సంబంధముందో పరిశీలిద్దాం.

కొన్నివేల సంవత్సరాల క్రిందటిమాట. పాశ్చాత్యులకు సూర్య కిరణాలలోని రంగులను గూర్చిగాని శక్తులను గూర్చిగాని సరియగు అవగాహన లేని రోజులవి. ఈ నాటి న్యూటన్ కలర్ కార్డుగాని సోలారియం స్పెక్ట్రో స్కోపుగాని, క్వార్ట్జ్ లాంపులాంటి ఆధునిక వైజ్ఞానిక సాధనాలు లేని రోజులవి అలాంటిచరిత్రకందని అతి ప్రాచీనకాలంలో మన ప్రాచీన భారతీయ ఋషులు ఈ ప్రకృతినే ప్రయోగ శాలగా తమ తమ అతీంద్రియ శక్తులే సాధనాలుగా ఉపయోగించి ఖగోళాన్ని గూర్చి సూర్య కిరణాల స్వరూప స్వభావాలను గూర్చి బాగుగా పరిశోధించి అనేక విషయాలు సూత్ర బద్ధంచేశారు ముఖ్యంగా సూర్య కిరణాల యందలి గ్రూపులు, రంగులు ఆయా రంగుల కిరణాలు యే విధమైనశక్తులను విడుదల చేస్తాయో ఆయా శక్తుల వలనకలిగే ఫలితాలేమిటో గ్రంధస్తం చేశారు

భారతీయుల కాల పరిగణనలో సూర్యోదయం లగాయతు మరునాటి సూర్యోదయం వరకు గల కాలం ఒక అహోరాత్రము అనగా ఒక రోజు. ఒక రోజునకు 60 ఘడియలు లేక 24 గంటలు. పగలు 12 గంటలు రాత్రి 12 గంటలు. పగలు 12 గంటల కాలంలోనూ సూర్యుడు తూర్పు క్షితిజ రేఖ పై ఉదయించి క్రమ క్రమంగా ఆకాశంలో పయనించి సాయంకాలానికి పడమర క్షితిజ రేఖ పై అస్తమిస్తాడు ఈ 12 గంటల కాలంలో సూర్య కిరణాలు అన్ని వేళల్లోను ఒకే విధమైన శక్తులను విడుదల చేయవు వేరు వేరు సమయాలలో వేరు వేరు శక్తులను విడుదల చేస్తాయి అందుచేతనే పగటి కాలాన్ని అయిదు సమ భాగాలుగా విభజించారు.

సూర్యుడు తూర్పు క్షితిజ రేఖ పై ఆరు గంటలకు ఉదయించే టప్పుడు అనగా రాత్రింబవళ్ళు సమానంగా ఉన్నప్పుడు -

6 గంటల నుండి 8-24 వరకు ప్రాతః కాలము

8-24 గంటల నుండి 10-48 వరకు సంగవ కాలము

10-48 గంటల నుండి 01-12 వరకు మధ్యాహ్న కాలము

01-12 గంటల నుండి 03-36 వరకు అపరాహ్న కాలము

03-36 గంటల నుండి 06-00 వరకు సాయాహ్న కాలము

ఈ పైనుదహరించిన వేర్వేరు కాలముల యందు ప్రసరించే సూర్య కిరణాల శక్తి వేర్వేరు ఫలితాలనిస్తుందని మన పురాణాలు చెబుతున్నాయి. మన ఆధునిక వైజ్ఞానికులు కూడా ఇదే విషయాన్ని నిర్ధారించారు. ఇందులో మొదటిదయిన ప్రాతః కాలానికి ముందు అనగా సూర్యోదయాత్ పూర్వము

1. అరుణోదయ కాలము
2. ఉషః కాలము
3. బ్రాహ్మీ ముహూర్తము

అను మూడు కాలములు జరుగును. అవి ఒక్కొక్క ఘడియ కాలము మాత్రము వర్తించును. ఈ మూడు కాలములయందు వేర్వేరు శక్తులు గల కిరణాలు భూమండలం పై ప్రసరించి ప్రకృతియందలి నిద్రాణమైన శక్తులను ఉత్తేజ పరుస్తాయి.

ఉదయం 6-00 గంటలు కాగానే తూర్పు క్షితిజ రేఖపై సూర్యబింబం దర్శనమిస్తుంది. సూర్యుడు సహస్ర కిరణుడుగా క్షితిజంపైన సింహాసనాసీను డౌతాడు. ఆ సూర్య భగవానునికి ఎడమ ప్రక్కగా పర్జన్యుడు, జయంతుడు, ఇంద్రుడు అను ఉప దేవతలు, కుడిప్రక్కన సత్య, భృశ, ఆకాశ అనే దేవతలు తమ తమ సింహాసనాలను అధిష్ఠించి వరిపాలనకు బయలుదేరుతారు. అంటే సూర్యునితో కలసి మొత్తం ఏడు కిరణ సమూహములు భూమాతను తమ తమ అమృత కిరణాలతో ఆనందపరుస్తాయి. అయితే పర్జన్య, జయంత, ఇంద్ర అనే కిరణ సముదాయాలు కొంచెం తేడాతో అల్ట్రా వైలెట్ కిరణాలను ప్రసరి స్తాయి. సత్య, భృశ, ఆకాశ అనే సమూహాల కిరణాలు కొంచెం భేదంతో ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలను విడుదల చేస్తాయి. ఈ రెండు రకాలైన కిరణాలు విడుదల

ద్వారా ప్రాణికోటి మనుగడకు అవసరమైన ప్రాణశక్తి పుష్కలంగా విడుదల చేయబడుతుంది. అంతేగాక అనేక విధాలైన ఔషధ శక్తులు విడుదలయగుచూ ఓషధులకు మంచి శక్తులను కలిగిస్తాయి.

ప్రాతః కాల సమయం గడచి సంగవ కాలం సమీపించేటప్పటికి ఆకాశంలో ఆ ఏడు విధముల ఆధిపత్యం సమాప్తమగును. సంగవ కాలం సమీపించేటప్పటికి సూర్యునియందలి 'అర్యమ' అనే కిరణ సమూహం ఆకాశాన్ని అధిరోహిస్తుంది. అతనికి ఎడమప్రక్క-' అప' అపవత్స' అనేకిరణసమూహం కుడిప్రక్క- ''సవిత్రా'' ''సవితా''అనే కిరణ సమూహం తమ తమ శక్తులను ప్రసరింప చేస్తాయి. ఈ కిరణాలలో ఖనిజాలు లవణాలు కొన్ని రకముల విటమినులు గల శక్తులు ప్రాణులకు అందుతాయి

సంగవకాలం పూర్తియగు సరికి మిట్టమధ్యాహ్న సూర్యుని నిట్టనిలువ కిరణాలు భూమండలాన్ని ఆవరిస్తాయి. ఈ సమయంలో ఎడమ ప్రక్క ''పృథ్వీధర''అనే పేరుగల కిరణాలు, కుడి ప్రక్క-"వివస్వత్'అనే పేరుగల కిరణాలు పరిపాలిస్తాయి. మధ్యాహ్న కాలమంతా ఈ నిట్టనిలువ కిరణాలకు అధిపతి ఐన బ్రహ్మ పరిపాలిస్తాడు.

అపరాహ్న కాలం ప్రారంభమయ్యేటప్పటికి బ్రహ్మ స్థానంలో మైత్రాగ ణములనే కిరణాలు అధికారంలోనికి వస్తాయి. ఈకిరణసమూహానికి ''రుద్ర'' ''రుద్రదాస'' 'ఇంద్ర' ''ఇంద్రదాస ' అనే కిరణ సముదాయాలు తోడ్పడ తాయి.

సాయంకాలం అయ్యేటప్పటికి వరుణుడు పడమటి క్షితిజ రేఖపై సింహాసనాన్ని అధిరోహించి పితర,దేవారిక, సుగ్రీవ, పుష్పదంత, వీరుణ అసుర, శోష, పాపయక్ష్మ అనే ఏడు విధాలైన కిరణాలతో ఆకాశాన్ని పరిసేవిస్తాయి. ప్రత్యేకమైన శక్తిని విడుదల చేయుచు భూమండలం మీది ప్రాణులకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

★★★

వాస్తు పద విన్యాస క్రమము

వాస్తు పద విన్యాస పద్ధతి యందు గల వైజ్ఞానిక విలువలు తెలిసి కొంటిమి. అయితే నిర్మాణ క్షేత్రమున ఆ వాస్తుపద విన్యాసము యే విధముగా చేయవలయునో తెలిసి కొందము.

వాస్తు పదములు 32 విధములుగా చెప్పబడినది. ఆయా నిర్మాణ విశేషములను బట్టి ఆయా నిర్మాణ వైశాల్యము ననుసరించి యోగ్యమైన పదమునుగ్రహించుట శిల్ప సమయము. ఇందు ముఖ్యముగా

1. చతుఃషష్టిపదవాస్తు : 64 భాగములు గలది
2. ఏకాశీతి పదవాస్తు : 81 భాగములు గలది
3. శతపద వాస్తు : 100 భాగములు గలది.

ఈ మూడు విధాలైన విన్యాస పద్ధతులలోను రెండవదైన ఏకాశీతి పదవాస్తువద్ధతి బహుళప్రచారంలో ఉంది. ఏ విధమైన నిర్మాణానికైనా ముందుగా పరిసరాలను పరిశీలించి మనసుకు నచ్చిన క్షేత్రమును దిక్సూచికి కాని లేదా ఉత్తరాకాశంలో కనిపించే ధ్రువ నక్షత్రాన్ననుసరించి నాలుగు దిశలను సవరించి సరిహద్దులు ఏర్పరచుకొనుట ప్రథమకర్తవ్యము. చతురస్రముగా గాని ఆయతముగా గాని సరిహద్దులేర్పరచిన మొత్తము స్థలమునకు 'వాస్తువు' అని పేరు. అట్టి వాస్తువునకు గల ఈశాన్యపు కొయ్యను తూర్పు దిశగా ఒక అంగుళము, ఉత్తర దిశగా ఒక అంగుళము జరిపి సరిహద్దులను సవరించిన స్థలమునకు ఈశప్రాచీ అనిపేరు. ఇది మానసారములో ప్రతిపాదించబడినది.


ఆవిధంగా సవరించిన స్థలమునకు తూర్పు, దక్షిణ పశ్చిమ, ఉత్తర రేఖలను నిర్ణష్టపరచి నాలుగు మూలలయందు నాలుగు బలమైన కొయ్యలను పాతిపెట్టవలయును ఆ మధ్య స్థలమును సమతలముగా చేయవలెను.

ఆవిధముగా సమతలముచేసిన వాస్తు క్షేత్రమును 81 భాగములు గల

దానిగా విభజించినచో అది ఏకాశీతి పద వాస్తు అని పిలువబడును. అట్టి ఏకాశీతి పద వాస్తువు యొక్క బాహ్య రేఖ ప్రభావముచే వాస్తువునకు బయటగల వాస్తు దోషములు బయటమండి లోనికి రావు. అది యొకలక్ష్మణ రేఖవంటిది.

ఏకాశీతి పద వాస్తువుయొక్క బాహ్యరేఖ నంటిపెట్టుకొని 32 భాగములున్నవి. పంచ భూతాత్మకమైన ఆయా నిర్మాణక్షేత్రమునకు ఈ 32 భాగములు ఆకాశతత్వమునకు చెందినవి. పై 32 గడులను ఖాళీగా విడచి లోపలి భాగంలో ఆయా నిర్మాణాలకు ప్లానులు సిద్ధంచేసుకోవాలి. అంటే బయట ప్రాకారపు గోడపై ఏ విధమైన కట్టడాలు నిర్మించరాదని దీని భావం. దీనిని మరికొందరు పిశాచ భాగమని కూడా అందురు.


ఏకాశీతి పదవాస్తువు – ఆయతక్షేత్రము



ఏ నిర్మాణ క్షేత్రము నందయిననూ ఈ బాహ్య పదములు 32 ఖాళీగ విడిచి పెట్టవలెను బ్రహ్మ స్థానమును కూడా విడచుట నియమము. కానీ

ఆధునిక కాలమున ఈ నియమము సాధ్యపడుట లేదు. ఈ విధముగా వాస్తు క్షేత్రానికి బాహ్య పద భాగములు ఖాళీగ విడిచిన పిమ్మట మనము నిర్మింప దలచిన నిర్మాణమునకు గ్రహించిన స్థలమును నిర్దేశించి ఆ స్థలమునందు నిర్మించే నిర్మాణపు నమూనాను పై విధంగానే 81 గడులు గలదిగా ఏకాశీతి పదవిన్యాస పద్ధతికి లోబడి విభజించి ఈ క్రింది చక్రమునందలి విధముగా నాడులు సిరలు మర్మస్థానములు నిర్ధారించి ఆయా సిరా మర్మ స్థానముల యందు ఏ విధమైన వస్తువులు అనగా గుమ్మాలు, కిటికీలు, దూలాలు వగైరా నిలప రాదని గ్రహించాలి.


ఏకాశీతి పద వాస్తువు సిరామర్మ భేదము



ఈ పై చక్రమునందలి చుక్కలు సిర. మర్మ స్థానములుగా గుర్తించవ లెను.-చతుష్షష్టి పద వాస్తు విన్యాసము, శత పద వాస్తు విన్యాసము పై నుదహరిం

చిన ఏకాశీతి పద విన్యాసమువలె క్షేత్రము నందు విన్యసించవలెను. సింహ ద్వార నిర్ణయమునకు కూడా ఏకాశీతి పదమునందు చూపబడిన విధంగా

తూర్పు దిశయందు ఇంద్ర జయంత పదములయందు
దక్షిణ దిశయందు గృహక్షత, గంధర్వ పదములయందు
పడమర దిశయందు పుష్పదంత, సుగ్రీవ పదములయందు
ఉత్తర దిశయందు సోమ, భల్లాట పదములయందు
సింహ ద్వారము నిలుపవలెను.



వర్గాలు – వర్గాక్షరవిన్యాసము

వర్గాక్షర విన్యాసమును ప్రతిపాదించే ముందు ఈ వర్గాక్షరాలు యే విధంగా ఆవిర్భవించాయి, వాటికి గల ప్రాముఖ్యత యేమిటి? అనే విషయాలు విమర్శించుకోవాలి. కొందరు ఆధునికులు ఈ వర్గాక్షరాలు మానవులు తమ తమ భావ ప్రకటనా సౌలభ్యం కోసం కల్పించుకొన్న ధ్వని సంకేతాలు మాత్రమే అని సిద్ధాంతీకరిస్తున్నారు. కానీ, భారతీయ శాస్త్రాలు, సాంప్రదాయాలు వీరి సిద్ధాంతాన్ని అంగీకరింపవు.

భారతీయులకు వేదాలు పరమ ప్రామాణికాలు. ఆగమ శాస్త్రాలు కూడా వేద తుల్యములే. ఈనాడు సైన్సు ఎంతో అభివృద్ధి చెందింది. అయినా ఆ సైన్సు ఇంకా బాల్యావస్థలోనే ఉన్నదని కొందరి వైజ్ఞానికుల వాక్కు. ఈనాటికీ సైన్సుకు అందని ఎన్నో వైజ్ఞానిక రహస్యాలు వేదాల్లోనూ ఆగమ శాస్త్రాలలోను దాగి ఉన్నయని కొంత మంది ఆధునిక వైజ్ఞానికులు కూడా అంగీకరిస్తున్నారు.

ఉదాహరణకు : భరద్వాజ విమాన నిర్మాణ శాస్త్రంలో వర్ణింప బడిన విమాన నిర్మాణ రహస్యాలు ఆధునిక వైజ్ఞానికులకు యింకా అవగాహన కాలేదు. ప్రస్తుతం వర్గాక్షర సమామ్నాయం యేవిధంగా ఆవిర్భవించింది? అనే విషయాన్ని పరిశీలించాలి. ఆ వర్గాక్షర సముదాయం యొక్క ప్రాముఖ్యత ఎటువంటిదో గమనించాలి.

ప్రళయ కాలంలో ఈ జగత్తునంతా విస్తరించ మహాసముద్రం వంటి మహా శూన్యం వ్యాపించి ఉంది. అది ఆది మధ్యాంత రహితము. మహా చైతన్య విలసితము, ఆ మహా శూన్యం నుండి శబ్ద బ్రహ్మస్వరూపమైన 'ప్రణవం' అనే ''ఓం''కారము ఆవిర్భవించింది. ఆ ఓం కారమే ఈ సృష్టిలో వీర్పడిన మొట్ట మొదటి ధ్వని లేక నాదం. ఆ ఓంకార నాదం సర్వ జగత్తున వ్యాపించింది. ఆ ఓంకారము నుండే కుండలినీ శక్తి ఆవిర్భవించి ప్రాణులలో ప్రవేశించింది. ఆ కుండలినీ శక్తియే ఆది పరాశక్తియగు జగన్మాత. మానవ దేహములో ఏబది యొక్క శక్తి పీఠాలున్నాయని శాస్త్రాలు చెబుతున్నాయి. '' ఓం''కార రూపిణీ యగు కుండలినీ శక్తి మానవ దేహంలో గల 51 శక్తి పీఠాల నుండి ప్రథమ

స్థానంలో తానుండి మిగిలిన ఏబది శక్తి పీఠాల నుండి ఏబది అక్షరాలు ఆవిర్భవింపజేసింది. ఆ యేబది అక్షరాల వర్ణసమామ్నాయమే శారదాంబా స్వరూపముగా, నాద రూపిణియై మానవ దేహంలో ఆపాదమస్తక పర్యంతంగల శక్తి పీఠాలలో సూక్ష్మ రూపంలో సంచరిస్తూ ముఖ మార్గాన ఓష్ట్య, దంత్య, తాలవ్యాది స్థానముల గుండా విశిష్ట ధ్వనుల రూపంలో మాతృకావర్ణం అనబడే అకారాది క్షకారపర్యంతం గల అక్షర సమామ్నాయం బహిర్గతమై లోకమున వ్యాపించినది.

ఈ శారదాంబా స్వరూపమైన వివిధ వర్ణాక్షరాలు విభిన్న రూపాల కలయికతో గురు లఘు రూపాత్మక ప్రస్తార క్రమాన్ననుసరించి ఛందస్సు పుట్టింది. ఆ ఛందోబద్ధమగు అక్షర విన్యాసంతో శారదాంబ అలంకరింపబడి సాహిత్య జిజ్ఞాసువుల చేత ఆరాధింపబడుచున్నది. అందుచేతనే

అ క,చ,ట,త ప,యాద్యైర్దృష్టభిర్వర్ణవర్గైః
విరచితముఖ బాహోఃపాదమధ్యాఖ్య హృత్కా
సకల జగదధీశా శాశ్వతావిశ్వయోని
ర్వితరతుపరిశుద్ధిం చేతసః శారదావః (మాతృకా రహస్యం82)

పై శాస్త్ర వచనము ననుసరించి అ క,చ,ట త పాది అష్ట వర్గాక్షరములకు అధి దేవత ఆ ఆదిపరాశక్తియని మంత్ర శాస్త్రం వక్కాణిస్తుంది. మాతృకలనగా అకారాది క్షకార పర్యంతము గల ఏబది అక్షరాల సమూహమేనని అవగతమైనది గదా అయితే ఈ వర్ణాక్షరాలకు వాస్తుకు ఏమిటి సంబంధం? అని విమర్శించుకోవాలి అతీంద్రియ జ్ఞానసిద్ధులైన మన ప్రాచీన ఋషులు ఈ సమన్వయాన్ని పరిశోధించి సాధించారు. గమనించండి

గణేశ గ్రహనక్షత్ర యోగినీ రాశి రూపిణీం
దేవీం మంత్ర మయీం, నౌమి మాతృకాపీఠ రూపిణీం

అను సూత్రమునననుసరించి శారదామాత గణేశ, గ్రహ, తారకా రాశి రూపిణియై జ్యోతిశ్చక్రము నాశ్రయించి కాలచక్ర పరిభ్రమణమును కొనసాగించుచు జ్యోతిష శాస్త్రానికి ఆధార భూతమై నిలిచినది. పై శ్లోకమున మాతృకా పీఠమనగా అకారాది క్షకార పర్యంతముగల అక్షర సమామ్నాయమని తెలియవలెను

వర్ణాక్షరాలు వాస్తు, జ్యోతిష శాస్త్రాలలో వాటి ప్రాముఖ్యత


అకారాది క్షకార పర్యంతముగల వర్ణాక్షరాలు ఏబది. ఆ ఏబది అక్షరాలు ఎనిమిది వర్గులుగా విభజింపబడినవి. ఆ యెనిమిది వర్గులలోని అక్షరాలను వాటిశక్తి స్వభావాలనుగుర్తించిన మన ఋషులు అ క చ ట,త,ప య,శ అను వర్గులను ఈక్రింది విధంగా జ్యోతిశ్శాస్త్ర పరంగా అన్వయించారు.

వర్గులు	దిశలు	అధిదేవత	గ్రహం	సిద్ధులు	రాశులు
అ	తూర్పు	వశినీ	రవి	మహాలక్ష్మి	మేష, వృశ్చిక
క	ఆగ్నేయ	కామేశ్వరి	కుజుడు	బ్రహ్మ	తుల
చ	దక్షిణ	మోదిని	శుక్ర	మహేశ్వరి	వృశ్చిక
ట	నైఋతి	విమలా	బుధ	కౌమారి	ధనస్సు
త	పడమర	అరుణా	గురుడు	వైష్ణవి	మకరం
ప	వాయువ్యం	జయినీ	శని	వారాహీ	కుంభం
య	ఉత్తరం	సర్వేశ్వరి	చంద్రుడు	ఇంద్రాణి	మీనం
శ	ఈశాన్యం	కౌలిని	చంద్రుడు	చాముండీ	మీనం

పైన చూపిన చక్రోద్ధారమునందు వర్గులకు, రాశులకు గల సంబంధం కేవలం వాస్తుశాస్త్రానికిమాత్రమే పరిమితమైనది. మంత్రశాస్త్రములో వర్గులకు, రాశులకు మధ్య సంబంధం దీనికి భిన్నముగా ఉంటుంది. ఇక్కడ మనం వాస్తు శాస్త్రానికి సంబంధించినంత వరకు మాత్రము గ్రహించవలెను

విజ్ఞానశాస్త్రంలో ఎంతో అభివృద్ధిని సాధించినవి అని అనుకొంటున్న విదేశాలలో కూడా ఈ అక్షర విజ్ఞానం మిక్కిలి అభివృద్ధి పొందింది సంఖ్యాశాస్త్రం అంతా ఈ అక్షర విజ్ఞానం మీదనే ఆధారపడినది ఒక్కో అక్షరం పైన ఒకో సంఖ్య అధికారం కలిగి ఉంది. అమెరికాలో నామ ప్రథమాక్షరమునకుగల ప్రభావం మీద సుప్రసిద్ధమనో వైజ్ఞానికులు డా. ఫేవర్, డా. సవాలీన్‌వెస్టన్ అనే పరిశోధకులు విశేషంగా పరిశోధించి 'శబ్దం అనంతశక్తియుతం అని ఋజువు పరచారు. వారి పరిశోధనలు ఆధారంగా మనుష్యుల యొక్క పేర్ల యందలి మొదటి అక్షరం ఎంతో ప్రాముఖ్యత కలిగియుంటుందని నిర్ణయించారు. వారి

సిద్ధాంతాల ననుసరించి A నుండి R అను 18 అక్షరములు పేర్లకు మొదటి అక్షరముగా గలవారు మిక్కిలి అదృష్ట జాతకులగుచున్నారని నిర్ణయింపబడినది. భారతీయ జ్యోతిశ్శాస్త్రంలో కూడా నామ ప్రథమాక్షరానికి మిక్కిలి ప్రాముఖ్య మీయబడినది మనుష్యుల యొక్క పేర్లయందు మొదట గల అక్షరముల ననుసరించి నామ నక్షత్ర పరిజ్ఞానము వివరింప బడినది వాస్తు శాస్త్రంలో వర్గారూఢము రూపుదిద్దుకొంది జ్యోతిశ్శాస్త్రంలో ఈ వర్గారూఢ పద్ధతి ఆసేతు హిమాచల పర్యంతం అమలులో ఉంది పరంపరాగతమైన ఈ సిద్ధాంతము మాతృకా స్వరూపిణియగు శారదాంబా వరప్రసాదమేనని భారతీయుల విశ్వాసము. వర్గారూఢము ననుసరించి ఆయా దిక్కులయందు వర్గ విన్యాసము ఈ క్రింది విధముగానున్నది



వర్ణాక్షర విజ్ఞానము

1. అ వర్గు అ,ఆ ఇ ఈ ఉ ఊ,ఋ,ౠ,ఌ ౡ ఎ ఏ,ఐ,ఒ ఓ,ఔ,అం అః.
2. క వర్గు -- క ఖ,గ,ఘ
3. చ వర్గు చ ఛ,జ,ఝ ఞ
4. ట వర్గు ట,ఠ డ,ఢ,ణ
5. త వర్గు త థ,ద ధ,న
6. ప వర్గు ప,ఫ,బ,భ,మ
7. య వర్గు య ర,ల,వ
8. శ వర్గు శ,ష,స,హ,ళ

పై వర్ణాక్షరములు మొత్తము 50 అక్షరములు వరుసగా ప్రాగాది ఎనిమిది దిక్కులయందు న్యాసము చేయబడినవి. 'స్వవర్గాత్ పంచమో రిపుః' అనే సూత్ర ప్రకారం స్వస్థానానికి అయిదవ స్థానము శత్రు స్థానమగుచున్నది. సమస్త నిర్మాణ కార్యముల యందు శత్రు స్థానమును విడువవలెను. వర్గారూఢము ననుసరించి ముఖద్వార నిర్ణయము అనుకూలింపనపుడు మాత్రము రాశ్యానుకూలమగు ముఖ ద్వారమును నిర్ణయించుట శిల్ప సమయము

వర్గారూఢము

వెనుకటి ప్రకరణంలో వర్ణాక్షరాల ప్రాముఖ్యత, వర్గారూఢం అనగా ఏమిటి అనే విషయాలు గ్రహించాం. ప్రస్తుతం వర్గారూఢాన్ని అనుసరించి గృహ నిర్మాణం ఏ విధంగా చేయాలి అనే విషయం పరిశీలిద్దాం. గృహ యజమాని పేరునందలి మొదటి అక్షరం ఏవర్గునకు చెందినదో నిర్ణయించి ఆ వర్గునకు తగినవిధంగా ముఖద్వారము ఉండేలా గృహానికి రూపకల్పనచేయాలి.

అ క,చాः పశ్చిమే ద్వారే టవర్గः పశ్చిమోత్తరే
ధనదే త,ప వర్గౌచ,య,శౌ పూర్వేతు దక్షిణే।

అనే శాస్త్ర ప్రమాణము ననుసరించి ఈ క్రింది పట్టిక ప్రకారం ముఖద్వార నిర్ణయం చేయాలి.

అ,క,చ	వర్గులవారికి	పశ్చిమ ముఖద్వారము శ్రేష్ఠము.
ట,	వర్గవారికి	పశ్చిమ , ఉత్తర ముఖద్వారము శ్రేష్ఠము
త,ప	వర్గులవారికి	ఉత్తర ముఖద్వారము శ్రేష్ఠము.
య,శ	వర్గులవారికి	తూర్పు, దక్షిణ ముఖద్వారము శ్రేష్ఠము.

గమనిక : గృహ యజమానుని పేరునందు అయిదారు పేర్లు కలిసి ఉన్నచో వాడుకలోనున్న పేరునందలి మొదటి అక్షరమునుబట్టి కూడా వర్గారూఢమును నామ నక్షత్ర నిర్ణయమును చేయు ఆచారము కొన్ని ప్రాంతములయందున్నది.

గృహ నిర్మాణ కర్త వర్గుననుసరించి ఎంచుకున్న స్థలమునందు ముఖద్వారము పెట్టి ఇంటిని నిర్మించుటకు పీలు పడనపుడు కర్త నామ రాశి రీత్యా ఈ క్రింది పట్టికననుసరించి ముఖ ద్వారము నిర్ణయించుకొను పద్ధతి శాస్త్ర సమ్మతము

ముఖద్వారము	ఏయే రాశులవారికి, ఏయే వర్గులవారికి శ్రేష్ఠము
1. తూర్పు ద్వారము	మేష, కర్కాటక, సింహ వృశ్చిక, ధను మీనము య శ వర్గులవారికి శ్రేష్ఠము
2. దక్షిణ ద్వారము	వృషభం, మిథునం, కర్కాటకం కన్య, మకర రాశుల వారికియ శ వర్గులవారికి శ్రేష్ఠము
3. పశ్చిమ ద్వారము	వృష, మిథు, తుల ధను, కుంభ రాశులవారికి అ,క,చ,ట వర్గులవారికి శ్రేష్ఠము
4. ఉత్తర ద్వారము	మేష, వృష, కర్కా, సింహా, వృశ్చి, కుంభ ధను మీన రాశులవారికి ట త ప వర్గులవారికి శ్రేష్ఠం

గమనిక : వర్గారూఢము ననుసరించిగాని రాశిరీత్యాగాని యోగ్య మగు ముఖద్వారము వీలు పడనియెడల స్థలానికి అనువైనంత మాత్రాన గృహ నిర్మాణం చేయరాదు.

ముఖద్వార నిర్ణయమునగల కొన్ని మెలకువలు

1. తూర్పుముఖద్వారము : అ వర్గువారికి తూర్పు ముఖద్వారము గల పడమటిల్లు నిషేధము. ఐనను అ అక్షరము మేషరాశికి చెందినది కాబట్టి అ వర్గునందలి అ అక్షరము తమ పేరునందలి మొదటి అక్షరముగా గలవారు మాత్రము తూర్పు ముఖద్వారమును మధ్యమ పక్షముగ స్వీకరింపవచ్చును. అట్లే త వర్గువారికి తూర్పు ముఖద్వారము చెప్పబడలేదు. ఐనను త అను అక్షరము పేరులో మొదటి అక్షరముగా గలవారికి పడమర స్వస్థానవ ు కాబట్టి తూర్పు ముఖద్వారము గల పడమటిల్లు నిర్మించుకొనవచ్చును అట్లే ద, న అనే అక్షరాలు గలవారి రాశి రీత్యా తూర్పు ముఖద్వారము అర్పణమే

2. దక్షిణముఖద్వారము : చ వర్గువారికి దక్షిణ ముఖద్వారము గల ఉత్తరపు ఇల్లు నిషేధము అయినప్పటికి చ వర్గునందలి జ అనే అక్షరం మకర రాశికి

చెందినది కాబట్టి రాశి రీత్యా జ కారము నామ ప్రథమాక్షరముగా గలవారు దక్షిణ ముఖద్వారము గల ఉత్తరపు ఇల్లు నిర్మించుకొనవచ్చును. చ నామ ప్రథమాక్షర ముగా గలవారుమాత్రము దక్షిణ ముఖద్వారము గల ఉత్తరపు ఇల్లు నిర్మింప కూడదు.

3. పశ్చిమ ముఖ ద్వారము : త వర్గువారికి పశ్చిమ ముఖద్వారము నిషిద్ధము. అయినను త,ద అను అక్షరాలు తులా, ధనూరాశులకు చెందినవి కాబట్టి త,ద అను అక్షరములు నామ ప్రథమాక్షరముగా గలవారు పశ్చిమ ముఖద్వారముగల ఇల్లు నిర్మించుకొనవచ్చును. కాని 'న' నామ ప్రథమాక్షర ముగా గలవారు పడమర ముఖద్వారముగా గల తూర్పు ఇల్లు నిర్మింపరాదు.

4. ఉత్తర ముఖద్వారము: య వర్గువారికి ఉత్తర సింహద్వారము నిషేధము కాని 'య' వృశ్చిక ధనూ రాశులకు 'ల' మేషరాశికి 'వ' వృషభరాశికి చెందినది. కావున య.ల.వ అను అక్షరాలు నామ ప్రథమాక్షరాలుగా కలవారు మధ్యమ పక్షముగా ఉత్తర సింహ ద్వారముగల దక్షిణపు ఇల్లు నిర్మింపవచ్చు కాని 'ర' నామ ప్రథమాక్షరముగా గలవారు ఎంత మాత్రము ఉత్తర సింహద్వారము గల ఇల్లు నిర్మింపరాదు.

గమనిక. వర్గారూఢము సర్వశ్రేష్ఠమైనది. వర్గారూఢము వీలుపడనపుడు మాత్రమే రాశ్యాను కూలమగు ముఖ ద్వారమును నిర్ణయింపవలెను.



క్షేత్రమునందలి దిశలు-వాటిభాగస్వామ్యము

దిక్కులు నాలుగు విదిక్కులు నాలుగు మొత్తం ఎనిమిది దిక్కులు ఈ దిక్కులతో పృధివి, ఆకాశం కలిసి దశ దిశలనికూడా వ్యవహరిస్తుంటాం. 1. తూర్పు, 2. ఆగ్నేయము, 3. దక్షిణము, 4. నైఋతి, 5. పడమర 6. వాయువ్యం, 7. ఉత్తరం, 8. ఈశాన్యం అనునవి వరుసగఎనిమిది దిక్కులు ఈ ఎనిమిది దిక్కులలోను తూర్పు, దక్షిణం పడమర, ఉత్తరం ప్రధానమైన దిక్కులు, ఆగ్నేయం నైఋతి, వాయువ్యం, ఈశాన్యం అనే నాలుగు కోణ దిశలు ఈ ఎనిమిది దిశా భాగములకు ఆధిపత్యం వహించి పరిపాలించే దిక్పతులు ఉన్నారు.

దిశ	అధిపతి
తూర్పుదిశ	ఇంద్రుడు
ఆగ్నేయదిశ	అగ్ని
దక్షిణదిశ	యముడు
నైఋతిదిశ	నైఋతి
పశ్చిమదిశ	వరుణుడు
వాయువ్యదిశ	వాయువు
ఉత్తరదిశ	కుభేరుడు
ఈశాన్యదిశ	రుద్రుడు

ఈ పైనుదహరించిన వరుస ప్రకారం ఆయా దిశలకు అధిపతులైన దేవతలు వారి యొక్క స్వభావాలకు అనుగుణంగా ఫలితాలనిస్తారని శాస్త్రకర్త లైన ఋషుల అభిప్రాయం. నిర్మాణ క్షేత్రమునందు ఏయే దిశలకు ఎంతెంత భాగస్వామ్యము గలదో గ్రహించుట ముఖ్యాంశము. ఈ విషయాన్ని గూర్చి ద్విశాలా నిర్మాణ ప్రకరణంలో అపరాజిత పృచ్ఛ అనే గ్రంథంలో నిర్ధారింప బడింది.

చతురస్రం సమంకృత్వా, త్రిపుటే నవకోష్ఠకం
మధ్యకోష్ఠం పదం త్యక్త్వా శాలాయుగ్మేప్రతిష్ఠితా

పై ప్రమాణము ననుసరించి క్షేత్రమును (ఆయతముగాని చతురస్రముగాని) తొమ్మిది సమభాగములుగ విభజించి మధ్య పదమును బ్రహ్మ పదముగ విడువవలెను మిగిలిన ఎనిమిది భాగములు వరుసగ ప్రాగాదిగ ఎనిమిది దిక్కులుగ గుర్తించవలెను. ఈ క్రింది విభజనను గమనింపుడు

ఈశాన్యం	తూర్పు	ఆగ్నేయం
ఉత్తరం	బ్రహ్మస్థానం	దక్షిణం
వాయువ్యం	పడమర	నైఋతి

పై విభజన ననుసరించి ఆ క్షేత్రభాగములందు ఆయా దిశా భాగస్వామ్యము కలుగును. ఆయా దిశా భాగములందు ఆయా దిక్పతులు ఆధిపత్యము కలిగి యుందురు. అందు విదిక్కులకు లభించిన భాగములకు ఈ క్రింది వివరణమును పరిశీలింపుడు.

ఈశాన్యము :

ఈశాన్యదిశకు లభించిన భాగమునకు తూర్పునగల భాగము, తూర్పు ఈశాన్యముగాను, ఉత్తరమునగల భాగము ఉత్తర ఈశాన్యముగాను పిలుచుట అనూచానముగా వస్తున్న ఆచారము. దీనినే శిల్ప సమయమని కూడా అందురు. ఈ రెండు దిశలు పెరిగి యుండుట శుభ ప్రదమని శాస్త్రకారుల అభిప్రాయము.

ఆగ్నేయము :

ఆగ్నేయమునకు చెందిన భాగమునకు తూర్పునగల స్థలమును తూర్పు ఆగ్నేయమని, దక్షిణమునగల స్థలమునకు దక్షిణాగ్నేయమనియు వ్యవహరింతురు

ఆగ్నేయ ప్రాచిసంయుక్తం సర్వదోషకరంభవేత్
ఆగ్నేయ ప్రాచికంవాస్తు తస్మాత్ సర్వంవిసర్జయేత్
మానసారం-పే 17

అని మానసార మహర్షి చెప్పియున్నాడు కాబట్టి ఆగ్నేయం పెరిగిన స్థలమునందు పెరుగుదలను విడిచి పెట్టవలెను.

నైబుతి :

నైబుతి దిశాభాగము నందలి దక్షిణ దిశయందలి స్థలము దక్షిణనైబుతి యనియు, పశ్చిమ దిశయందుగల స్థలమును పశ్చిమనైబుతి అనియు వ్యవహరింతురు. ఈనైబుతి దిశకు దక్షిణ పడమరలయందు పెరిగినస్థలము వంశ నాశనమును కలిగించును. కాబట్టి ఈ దిశలయందలి పెరుగుదలను ఖండించి తప్పనిసరిగా మూలమట్టమునకు సరిచేసి దిక్కులు సవరించుకొనవలెను అట్లు చేయనియెడల దిశాధి పతియైన నైబుతి రాక్షస స్వభావము అశుభములను కలిగించును

వాయువ్యము :

వాయువ్య దిశాభాగమునకు పడమర దిశయందున్న స్థలము పడమర వాయువ్యము ఉత్తర దిశయందున్న పెరుగుదలకు ఉత్తరవాయువ్యమని వ్యవహరింపబడుచున్నది ఈ పెరుగుదలలు కూడమేలునుకలుగజేయవు వాయువ్య దిక్పతి బలము పెరిగి గృహము నందు అంతఃకలహములు భార్యా భర్తలకు వైరములు, పిల్లల పోట్లాటకు అందు నివసించు స్త్రీలకు అరిష్టములు కలుగును. వాయువ్యం పెరుగుటచేత ఉత్తర ఈశాన్యములు లోపించి దిక్పతులు బలహీన పడుదురు అందుచేత శుభ ప్రదము కాదు. ''దిగ్వృద్ధే కులనాశస్యాత్ వక్రేదారిద్ర్యమాదిశేత్' అనగా ఏ దిశలూ లోపముకారాదు. ఏ దిశ యొక్క సరిహద్దు రేఖ వంకరగా యుండరాదని శాస్త్రవచనము.

కాబట్టి గృహ నిర్మాణ క్షేత్రము యొక్క నాలుగు దిశలను మొదట దిక్సూచీకి సవరించి ఆ పిమ్మట ఉత్తర ఈశాన్యము ఒక అంగుళము తూర్పు ఈశాన్యము ఒక అంగుళము పెంచి ఈశప్రాచీ అను స్థలమును రూపొందింప వలయును ఈ క్రింది వాక్యమును గమనింపుడు

తద్వశాత్ కకుభంగ్రాహ్యం తత్ర సూత్రం ప్రసారయేత్
శుద్ధప్రాచీ భవేత్ సౌమ్యగైశాన్యప్రాచ్యధోచ్యతే

ప్రాచ్యాంగుళ కృతాద్భిందో ఉత్తరేచాంగుళంన్యశేత్
ప్రతీచీ మాత్రతద్భిందోః ఈశప్రాచీం ప్రసూత్రయేత్

కాబట్టి విజ్ఞులు గృహ నిర్మాణ స్థలాన్ని ఒక్క ఈశాన్య భాగమున తప్ప యే దిశయందు పెరుగుట గాని లోపము గాని లేకుండా స్థలమును సవరించుకొని ఆయా దిశా భాగములను వాటి అధిపతులను శుభాశుభ ఫలితములను అహాహనచేసుకొని నిర్మాణకార్యక్రమమును ప్రారంభింపవలెను. ఈ నియమము స్థలమునకు తప్ప నిర్మాణ గృహమునకు వర్తించదు.

గమనిక: ఇక్కడ ఒక ముఖ్యవిషయాన్ని గమనించాలి. యేవిధమైన శాస్త్ర ప్రమాణానికైనా రెండు విధులుంటాయి. ఇందు మొదటిది సామాన్య విధి. అనగా అన్ని చోట్లా సమాన స్థాయిలో అమలుపరచ తగినవది. రెండవది విశేషవిధి ఈ సామాన్య విధిని అమలుపరచడం సాధ్యం కానప్పుడు ఈ విశేష విధులను అనుసరించాలి. ఈ విశేషవిధి దేశ కాల పాత్రతలకు అనుగుణంగా శాస్త్ర వచనానికి విఘాతం లేకుండా కొంచెం వెసులుబాటు కల్పిస్తుంది. దిశా భాగ స్వామ్యాన్నమసరించి బ్రహ్మ పదాన్ని విడిచి పెట్టి వర్గారూఢ పద్ధతిని అనుసరించి, శత్రు మిత్ర క్షేత్ర విమర్శ చేసికొని శత్రు వర్గ భాగ దిశను విడచి నగర గ్రామ, గృహాది నిర్మాణములు చేపట్టాలి. అయితే నగర, గ్రామాది నిర్మాణాలలో ఈ సూత్రం ఆచరణ సాధ్యమే. కానీ సామాన్య గృహ నిర్మాణంలో ఈ విధానం ఆచరణ సాధ్యం కాదు. ఆధునిక కాలంలో క్రిక్కిరిసి పోవుచున్న జనారణ్యంలాంటి నగరాలలో ఈ బ్రహ్మ పదం విడిచి పెట్టి గృహ నిర్మాణం చేయడం అసాధ్యంగానే యున్నది. కాబట్టి ఈ పరిస్థితులలో ''విశేషవిధి''ని ఆశ్రయించి దేశకాల పాత్రతలకు తగిన నిర్మాణశైలితో గృహ నిర్మాణం చేయాలి.

ఉదాహరణకు: కలకత్తా, హైదరాబాదువంటి మహానగరాలలో ఒక వ్యక్తి 40x30 చతురపుటడుగుల స్థలంలో నవభాగ క్రమంలో మధ్యగల బ్రహ్మపదం విడచి చుట్టుమగల వాస్తు పద విన్యాసం ప్రకారం బాహ్య దేవతా పదాలను విడచి పెట్టి మిగిలిన స్థలంలో గృహ నిర్మాణం సాధ్యమా? కాబట్టి ఇక్కడ విశేషవిధిని ఆశ్రయించాలి. అనుభవజ్ఞులైన స్వపతులు పై విషయములు చక్కగా గ్రహించి గృహ నిర్మాణాదులను చేపట్ట గలరు.

★★★

దిశలు – సూర్యకిరణాల ప్రభావం

దిక్కులకు శక్తులు యేవిధంగా లభిస్తున్నాయి? అనే విషయం మన ప్రాచీన గ్రంధాల ఆధారంగా దిగధిపతులైన దిక్పతుల ప్రభావం చేత అని సమాధాన పరుస్తాం. కాని ఆధునిక వైజ్ఞానిక దృక్పధంలోకూడా పరిశీలించి ఆయా దిశలకు లభ్యమయ్యే ప్రాకృతిక శక్తి యెట్టిదో విచారించ వచ్చును వాస్తు శాస్త్ర మంతా సూర్యగమనం ఆయా సమయాల్లో భూగోళం మీద ప్రసరించే సూర్య కిరణాల ప్రభావం'' అనే విషయాల ఆధారంగా రూపొందించబడింది. దిశల బలాబలాలను గురించి కూడా ఆయా కాలమురియందు ప్రసరించే సూర్య కిరణ ప్రసారం వాటి ప్రాకృతిక శక్తుల ఆధారంగా ఆయా దిశలు శక్తివంతం అవుతాయి. ఆయా దిశలకు సూర్యకిరణ ప్రసారం చేతనే ప్రత్యేక శక్తులు సంక్రమిస్తాయి. పై విషయాన్నీ వాస్తు శాస్త్ర గ్రంధాలలో రూపొందింప బడిన వాస్తుపద విన్యాసం అనే ప్రకరణం విశదీకరిస్తుంది. 9వ ప్రకరణంలో చెప్పబడిన విషయాలే ఈ ప్రకరణంలో విపులంగా చర్చించ వలసి ఉంది. పాఠకులు పునరుక్తిగా భావింపరాదు.

ఈ భూగోళం పడమర నుండి తూర్పు దిశగా ఆత్మభ్రమణం చేస్తూ ఉంటుందని ఇదివరలో చదివాం ఆ భూ భ్రమణ సిద్ధాంతం ప్రాతిపదికగా ఏయే సమయాలలో ఏయే దిశలను ఏయే సూర్య కిరణాలు ప్రభావితం చేస్తాయో నిర్ధారించబడింది వరుసగా ప్రాతఃకాలము, సంగవకాలము మధ్యాహ్న కాలం, అపరాహ్న కాలం, సాయాహ్న కాలం అని ఐదు కాలములుగా పగటికాలము విభజింపబడినది. ఈ ఐదు కాలముల యందు సూర్యకిరణాలు విడుదల చేసే ప్రాకృతిక శక్తులు ఒకే విధంగా ఉండవు

''అపరాజిత పృచ్ఛ'' అనే ప్రాచీన వాస్తుగ్రంధాన్ననుసరించి

1. ప్రాతఃకాలము: ప్రాతఃకాలమున సూర్య కిరణాలు విడుదల చేసే శక్తులకు సూర్యుడు అధిదేవత అధిదేవత అనగా ఆయా కిరణాలు విడుదల చేసే సౌరశక్తుల స్వభావాలకు గుణాలకు, ఫలితాలకు ప్రతీక మాత్రమే

2.సాయంకాలము: సూర్యకిరణాలు విడుదలచేసే శక్తులకు వరుణుడు అధిదేవత ప్రాతఃకాలము, సాయంకాలముల యందు సూర్యకిరణాలు విడుదల చేసే ప్రాకృతిక శక్తులు వేర్వేరు ఫలితాలనిస్తాయి. ఈ వైజ్ఞానిక విలువలను విజ్ఞులు పరిశీలించి తెలుసుకోగలరు. గమనింపుడు--

ఈశాన్యదిశ:

వాస్తు శాస్త్రంలో ఈశాన్యమునకు గల ప్రాముఖ్యం గమనించదగినది. ఈశాన్యమునకు అధిపతి ఈశానుడు అనే రుద్రుడు. ప్రాతఃకాలములో విడుదలయ్యే సూర్యకిరణ సమూహంలో గల అల్ట్రావయొలెట్' కిరణపుంజాలకు అధిదేవత. ఈ అల్ట్రావయొలెట్' కిరణాలువదిహేనుగుంపులు. ఆయా గుంపులు విడుదల చేసే శక్తుల ఆధారంగా మన మహర్షులు ఆయా కిరణాలకు ఈక్రింది పేర్లు పెట్టారు.

1. నీలకంఠ	6. అతీంద్రియ	11. జ్వలత్రిశూల
2. త్రినయన	7. సూక్ష్మి	12. గండమాల
3. సహస్రాక్ష	8. అనంత	13. నాగేంద్రహార
4. వజ్రదంష్ట్ర	9. శశిశేఖర	14. నాగేంద్రవలయ
5. అత్యుగ్ర	10. గంగాధర	15. శంకర

ఈ 15 గుంపుల కిరణాలు తమ తమ పేర్లకు తగిన ఫలితాలనిచ్చే సౌరశక్తిని విడుదల చేస్తాయి. సూర్యబింబం తూర్పు దిక్కున క్షితిజరేఖ మీద ప్రత్యక్షమయ్యే ప్రాతఃకాలం నుండి సంగవకాలం ప్రారంభమయ్యే వరకు ఈ15 గుంపుల సౌరశక్తులు ఈశాన్యదిశాభాగాన్ని ప్రభావితం చేస్తాయి. మనం ఎంచుకొన్న నిర్మాణ క్షేత్రంలో బాహ్య రేఖకు లోపల చుట్టూ గల 32 పదముల కాళీస్థలం అనగా తొమ్మిదవ భాగం (పిశాచభాగం) విడచి మధ్య భాగంలో గృహ నిర్మాణం చేస్తాం. ఆ విధంగా నిర్మించిన ఇంటికి ప్రాగాది ఎనిమిది దిక్కులు ఏర్పడతాయి. ఈ భూగోళం పడమర నుండి తూర్పు దిశగా ఆత్మభ్రమణం

చేస్తుంది. ఆకారణంచేత మన నిర్మాణక్షేత్రంకూడా భూమితో పాటు తూర్పు దిశగా కదులుతుంది. ఆ కారణంచేత తూర్పు క్షితిజరేఖ మీద సూర్యబింబం ఉదయించగానే మొట్టమొదటి సూర్యకిరణం మన నిర్మాణ క్షేత్రానికి ఈశాన్య దిశను తాకుతుంది ఆ విధంగా ఈశాన్యదిశ ప్రాతఃకాల సూర్యకిరణ సమూహా లచేత ప్రభావితమై మహాశక్తి సంపన్న మగును ఉదయకాల సూర్యకిరణాల యందలి ఆల్ట్రావైలెట్' కిరణ శక్తులు వివిధ రకాలైన ఔషధ రసాయనిక శక్తు లను ఈశాన్యదిశ యందు నిండియున్న గాలిలోను నీటిలోను నింపి ఆ భాగాన్ని శక్తివంతంగా చేస్తాయి.

రెండవదైన సంగవ కాలం ప్రారంభం కాగానే క్రమ క్రమంగా సూర్య బింబం ఆకాశంలో పైకి లేచే కొద్దీ సూర్యకిరణాలలోని పర్జన్య, జయంత యింద్ర అనేకిరణ సమూహాలువెనకటి ఆల్ట్రావైలెట్ కిరణాలకు చేయూ తనిస్తూ మానవ జీవితానికి అత్యవసరమైన ప్రాణశక్తిని (ఆక్సిజన్) ఈశాన్య తూర్పు భాగాలయందున్న గాలిలోని అణు సముదాయానికి పుష్కలంగా అందిస్తాయి. ఆ ప్రాణవాయువు నెమ్మదిగా గృహాభిముఖమై ఆ గృహమున నివసించే ప్రాణులకు అందిస్తుంది ఆ విధంగా తూర్పు ఈశాన్యదిశలు గృహస్తు లకు ప్రాణప్రదమైనవి. తూర్పు దిశాధిపతి ఇంద్రుడు. దేవతలకు రాజు సమస్త శుభముల సంపదల నిచ్చే దైవము సంగవ కాలంలో సూర్యుని నుండి వెలువడే పర్జన్య ఇంద్ర, జయంత అనే మూడు సమూహాల కిరణాలు ఇంద్ర సంబంధ మైనవి. కాబట్టి తూర్పు దిశ పై కిరణాల చేత మిక్కిలిగా బలపడి గృహస్తులకు ఐశ్వర్యములు చేకూరుస్తుంది. అందుచేతనే ప్రతి గృహానికి యింద్రస్థానమైన తూర్పుదిశ తగినంత వైశాల్యం కలిగి ఉండాలి అందుచేతనే తూర్పు ఈశాన్య ములయందు ఎత్తుగా పెరిగిన సూర్యకిరణ ప్రసారాన్ని అడ్డగించే చెట్లను పెంచడం కట్టడాలను నిర్మించడం చేయకూడదని వాస్తు శాస్త్రం చెబుతుంది. అంతేగాక ఈశాన్య తూర్పు దిశలు గృహాన్ని బట్టి తగినంత వైశాల్యం కలిగి ఉండకపోతే ఆ గృహస్తులు మానసిక అశాంతితోను రోగగ్రస్తులై దరిద్ర దశను అనుభవిస్తూ దుఃఖాలపాలవుతారని శాస్త్రం వివరిస్తుంది

మరో ముఖ్య విషయంయేమనగా ఈశాన్య, తూర్పు దిశలయందు నూయి ఎందుకు తీయాలి? నీటిలో విద్యుచ్ఛక్తిని గ్రహించే శక్తి అధికంగా ఉంది ప్రాతఃకాల సూర్యకిరణాలు విడుదల చేసే సౌర శక్తియందలి విద్యుచ్ఛక్తి నూతి యందలి నీరు తన లోనికి పీల్చుకొని నిలువ చేసి గృహస్తులకు ఇస్తుంది. అంతే గాక నీటియందలి కీటకాలను సంహరించి శుభ్రపరచే శక్తి ఉదయకాల సూర్య కిరణాలకు మాత్రమే ఉంది. ఆ ఉదయ కాల ''అల్ట్రావైలెట్'' సౌర శక్తి తూర్పు ఈశాన్య దిశా భాగములకు తప్ప మరే భాగములకు లభింపదు.

ఆగ్నేయదిశ:

ప్రాతః కాలం గడచి, సంగవ కాలం ఆరంభమయ్యేసరికి ఆగ్నేయ దిశా భాగంలో కొంత వరకు సూర్యకిరణ ప్రభావానికి లోనవుతుంది. సూర్యకిరణా లలోని సత్య, భృశ, ఆకాశ అనే కిరణ సమూహాలు ఆగ్నేయ దిశా భాగాన్ని ముంచెత్తుతాయి. ఇవి అగ్నిదైవతాలు.వీటిని ''ఇన్‌ఫ్రారెడ్'' కిరణాలని వైజ్ఞానికులు అంటారు. ఈ కిరణ సమూహం కూడా ప్రాతఃకాల పరిపుష్టిని కలిగించే పర్జన్య, జయంత, ఇంద్ర, కిరణ సమూహాలు విడుదల చేసే శక్తులలో ఉష్ణ శాతం అధికంగా ఉంటుంది. అందుచేతనే ఈ కిరణాలను అగ్ని దైవతాలం టారు.

దక్షిణ – ఉత్తరదిశలు :

భూభ్రమణవశాత్ పగలు సంగవ కాలం దాటేటప్పటికి మధ్యాహ్న కాలపు సూర్యుడు మన నడినెత్తిన వెలుగులు విరజిమ్ముతూ నిట్ట నిలువు కిరణాలతో భూమాతను తపింపజేస్తూ ఉంటాడు. ఈ సమయంలో విడుద లయ్యే సూర్య కిరణాలకు బ్రహ్మ అధిదేవత. ఈ బ్రహ్మ తన అధీనమైన కిరణసమూహాన్ని రెండు సమ భాగాలుగా విభజించి దక్షిణోత్తర దిశలకు సమంగా విడుదల చేస్తాడు. సూర్య బింబానికి దక్షిణ దిశగా వెలువడే కిరణాలకు యముడు అధిష్ఠాన దేవత. ఉత్తర దిశగావెలువడే కిరణాలకు సోముడు అధిదే వత. ఈ కిరణ పుంజాలనుండి వెలువడే ఖనిజ, లవణ, ధాతువక్తులు భూమం డలం మీద చెట్లు, చేమలు పెరుగుటకు, ఫల పుష్ప లతాదులు వృద్ధి పొందు

టకు మూలకములవుతాయి. అంతేగాక మేఘాల ఉత్పత్తికి ఈ కిరణ సమూహాలే మూలకారకములు. ఈ విధంగా మధ్యాహ్న కాలపు అధిదేవత బ్రహ్మ తన సృష్టికి కావలసిన అవసరాలను అందిస్తాడు.

నై ఋతి – వాయువ్యదిశలు :

ఈ రెండు దిశల భూ భాగం మీద మధ్యాహ్న, అపరాహ్నకాలపు సూర్య కిరణాలు ప్రభావం చూపుతాయి.

పడమరదిశ :

సూర్యరథం పడమర దిశయందు క్షితిజరేఖ వైపునకు సాగిపోయే కొద్దీ సాయాహ్న కాలం ఆరంభమౌతుంది ఆ కాలంలో భూమికి ప్రసారం అయ్యే సూర్యకిరణాల శక్తి ప్రాతఃకాలంలో ప్రసారమయ్యే సూర్యకిరణాల శక్తికంటె విలక్షణమైనది. సాయం కాలపు సూర్య కిరణాలలో పశ్చిమ దిశాధిపతియైన వరుణ దేవుని శక్తి అధికంగా ప్రసారమౌతుంది. ఇందులో ఓషధీ గుణాలు అధికంగా ఉంటాయి. ఈకిరణాలు ప్రాణులకు ఎంతో మేలుచేస్తాయి. అందుచేత పడమర దిగ్భాగము చాలా శక్తివంతమైనదని వాస్తుశాస్త్రజ్ఞుల అభిప్రాయము.

పై నుదహరించిన కారణాల చేత ఆయా దిశా భాగాలు తగినంత విశాలంగా లేని యెడల సూర్య కిరణాల ప్రభావం తగినంతగా ఆయా దిశలకు లభించదు. ఆ కారణంచేత ఆయా దిక్పతులు బలహీనులై యజమానికి మేలు చేయరు. ఈ విధంగా నిర్మాణక్షేత్రమునందలి దిశా భాగములు ఆయా కిరణ ప్రసార శక్తి చేత బలీయములై ఆయా దిశలకు చెప్పబడిన సత్ఫలితాలనందిస్తాయి. ఈ పై చెప్పబడిన వివరణ అంతా స్వకపోల కల్పితం, ఊహాగానం మాత్రం కాదు. 'అపరాజితపృచ్ఛ' అనే ప్రాచీన వాస్తుశాస్త్ర గ్రంథంలో చెప్పబడినవైజ్ఞానిక వివరణలో అయిదుశాతం మాత్రమే ఇక్కడ వివరింప బడినది. ఇంకా వివరణ కావలసినవారు 'అపరాజితపృచ్ఛ' ను పరిశీలింపగలరు.



దిక్కులు - దిక్పతుల ప్రభావం

ఆయా దిక్కులు, ఆయా దిక్పతుల ప్రభావానికి లోనయి గృహ యజమానికి శుభ శుభ ఫలితాలను ప్రసాదిస్తాయి. అంతేగాదు ఆయా దిక్కులకు అధిదేవతలైన గ్రహాల యొక్క గుణగణాలకు స్వభావాలకు ప్రతిస్పందించి ఆ గృహాలలో నివసించేవారికి ఆయా స్వభావాలను ఆపాదింపజేస్తాయి. కాబట్టి ప్రతి దిశయందు ఆయా దిక్పతులు అధిదేవతలైన గ్రహాలు ఎంతమేరకు తమ తమ ప్రభావాన్ని చూపిస్తాయో పరిశీలిద్దాం.

1. తూర్పుదిశ:

తూర్పు దిశకు అధిపతి ఇంద్రుడు. దేవతలకు ప్రభువు. రాజ్యాధికార దర్పం గలవాడు. అష్టైశ్వర్య సంపన్నుడు. ఆ ఇంద్ర దిక్పతి బలవంతుడై ఉంటే అనగా ఆ దిశ ఇంటికి తగిన వైశాల్యం కలిగి ఉంటే ఆ గృహయజమాని మంచి రాజకీయనాయకుడు చతురుడు పరిపాలనా సామర్థ్యం గల ప్రజానాయకుడు అష్టైశ్వర్య సంపన్నుడు కాగలడు.

ఈ తూర్పు దిశకు రవి అధిదేవత. ఇతడు గ్రహరాజు. సర్వశక్తి సమన్వితుడు. రాజకార్య దురంధరుడు. శివభక్తిని ప్రసాదించువాడు. శౌర్య పరాక్రములు గలవాడు. కాబట్టి ఈ తూర్పు దిశ తగిన వైశాల్యము కలిగి యున్నచో గృహ యజమాని రాజ్యాధికారము చెలాయింపగలడు. అనేక రాజకీయ పదవులు పొందగలడు. మంచి చురుకుదనము, పుత్రపౌత్రాభివృద్ధి కలిగి యండును. ఆ గృహమునందు నివశించువారు పౌరుషవంతులు విద్యాభివృద్ధి కలవారు కీర్తివంతులు పురుషాధిక్యతకలవారు ఆగుదురు మరియు మిక్కిలి ఆత్మ విశ్వాసము గల వ్యక్తులుగా రూపొందగలరు.

ఈ తూర్పుదిశ యందు అష్టసిద్ధులలో మొదటిదగు మహాలక్ష్మి నివశించు చుండును. ఆ మహాలక్ష్మి యొక్క ప్రభావమునే ఆ గృహస్తుడు సర్వ సంపదలు పొంది సుఖ జీవనము గడుపువాడగును. ఈ తూర్పు దిక్కు తగినంత వైశాల్యము లేకుండా లోపించి యున్నచో పైన చెప్పిన ఫలితాంశములు నశించి అష్ట దరిద్రములు అనుభవించును. ఆ దిశయెంతగా లోపించిన అంత చెడు ఫలితములు అనుభవమునకు వచ్చును. పూర్తిగా లోపించి యున్నచో

వంశనాశనము పొంది బంధు పుత్రాదులకు దూరమై కష్టము అనుభవించును.

ఆగ్నేయదిశ :

ఈ దిశకు అగ్ని అధిపతి. సర్వభక్షకుడు ఉష్ణశక్తి కలవాడు. దుందుడుకు స్వభావము కలవాడు. అగ్ని బలవంతుడైనచో గృహయజమాని సహజముగా పవిత్రుడగును. కాని దుడుకు స్వభావము గలవాడు. శీఘ్ర కోపిష్ఠి అగును. అందు నివశించువారు, పిల్లలు కూడ దుందుడుకు స్వభావము కలిగియుందురు. యేది మంచి యేది చెడు అని విమర్శనాజ్ఞానము తక్కువై మూర్ఖ స్వభావము కలిగి యుందురు. యజమాని తనకు తాను అపకారము చేసుకొనువాడగును.

ఈ ఆగ్నేయ దిశకు అధిదేవత కుజుడు. పరాక్రమవంతుడు. కోపిష్ఠి. మూర్ఖత్వమే సహజ స్వభావముగా గలవాడు. వ్యవసాయమునకు కారకుడు. ఇతరులతో వాగ్వివాదము చేయువాడు. కలహప్రియుడు. దేశాలు తిరుగుట యందు అభిరుచి గలవాడు. ఇతరులమ అకారణముగా నిందించు అలవాటు గలవాడు.

ఆగ్నేయ దిశ బలము గలిగియున్నచో అనగా ఉండవలసిన దానికంటె పెరిగి యున్నచో పైన చెప్పిన గుణ గణాలు, స్వభావాలు ఆ గృహము నందు నివశించు జనులకు ఆవహించును. మానసిక స్థిమితము ఉండదు.

'ఆగ్నేయ ప్రాచీకం వాస్తుసర్వదోషకరం భవేత్
దేహరోగోవిత్తనాశో బంధుహానిర్భవిష్యతి'!

అనగా తూర్పు ఆగ్నేయం పెరిగి యున్నయెడల అనేక దోషములు కలుగును. ధన నష్టము, బంధువులు లేకుండుట జరుగునని భావము. కోర్టు లావాదేవీలలో కూడ చిక్కుకొనువాడగును. అంతేగాక

'మాషమాత్రంతు మీశాన్యం, పుత్రదారాది లాభకృత్
వ్రీహిమాత్రంతు ఆగ్నేయం సర్వగ్రహభయంతథా
దేహరోగోవిత్తనాశో బంధు హానిర్భవిష్యతి

అనే ప్రాచీన కారిక ననుసరించి, మినప గింజంత అయినా ఈశాన్యం పెరిగి ఉంటే పుత్రులు, భార్య, పిల్లలతో సుఖంగా కళ కళలాడుతూ అ యిల్లు

శోభించును కాని వట్ల గింజంతయినా ఆగ్నేయ దిశ పెరిగిన అనేక గ్రహ పీడా దోషములు ఆవహించి యుండును. అందు నివసించువారు రోగగ్రస్తులై, చర్మ వ్యాధులు దగ్గు లేక టి.బి.మొదలగు వ్యాధులు కలిగియుందురు. హాస్పటలే ఆ యింటి వారికి యిల్లగుచుండును. కాబట్టి యెంత మాత్రము తూర్పు ఆగ్నేయంగాని దక్షిణ ఆగ్నేయం గాని పెరిగి యుండరాదు.

'ఆగ్నేయ ప్రాచీసంయుక్తం సర్వదోషకరం భవేత్
ఆగ్నేయ ప్రాచీకంవాస్తు తస్మాత్సర్వం విసర్జయేత్'

మానసారం 17 పేజీ

కాబట్టి అగ్నేయ దిశ పెరుగుదల యెంత మాత్రము అంగీకరింపరాదు.

దక్షిణ దిశ :

ఈ దిశకు అధిపతి యముడు. యముడనగానే చాలా మందికి భయం. కాని యముడు సమవర్తి. ధర్మ సంరక్షకుడు న్యాయా న్యాయములను విచారించు ధర్మ పరిపాలకుడు. అనగా సాక్షాత్తు పరమేశ్వరుడే. కాబట్టి ఈ దిశ యింటికి తగినంత వర్గుననుసరించి వైశాల్యము కలిగియున్న ఎడల గృహ యజమాని స్వార్థము లేనివాడై ధైర్యవంతుడై పరోపకార పరాయణుడై న్యాయా న్యాయములను విమర్శించువాడై ధర్మ మార్గమున జీవించువాడగును. కష్ట సుఖములను సమవర్తియై సమానముగా భావించువాడగును.

ఈ దక్షిణ దిశకు అధిదేవత శుక్రుడు. ఈ శుక్రుడు బలవంతుడైనచో అనగా దక్షిణ దిశ వర్గ రూఢమునకు తగిన విధముగా వైశాల్యము కలిగి యున్న యెడల సమస్త సంపదలు గృహ యజమాని పొందుచుండును. వాహనాలలో తిరిగెడి వాడగును సంగీత నృత్యములన్న అందు నివశించు పిల్లలు చెవి కోసు కొందురు. గృహ యజమాని రాజకీయ ముద్రాధికారము కలిగి మంచి రాజ కీయ పదవులు పొందుట గాని లేదా మంచి ఉద్యోగము గలవాడు గాని అగును విలాస పురుషుడగు అవకాశము కూడ వున్నది ఈ దిశ తగు విధంగా బలపడి యున్న యెడల అష్టసిద్ధులలో మూడవదగు మహేశ్వరీదేవి అనుగ్రహం చేత ప్రజా నాయకుడై కీర్తి ప్రతిష్టలు పొందును

గమనిక: దక్షిణము కాళీ ఉండరాదనే ఆధునికుల వాదము శాస్త్రసమ్మతము కాదు మనశాస్త్రములలో 'క్రోశమేకంతు దక్షిణే' అని యున్నది.

నైఋతి దిశ :

నైఋతి దిశకు దిక్పతి నిఋతి అనే రాక్షసుడు క్రూరుడు. హింసా ప్రవృత్తి గలవాడు. యితరులను హింసించి ఆనందించు వాడు. విరంకుశుడు. ఈ నైఋతి దిక్పతి బలవంతుడైనచో ఆ గృహ యజమాని విరంకుశుడు. యెదుటి వారి మాటను నిర్లక్ష్యము చేయు వాడగును. ఇరుగు పొరుగు వారిని హింసించి ఆనందించు వాడగును. ఇందు నివశించువారి సంతానము కళా విహీనమై చెప్పిన మాట వినక దేశ ద్రిమ్మరులగుదురు. శత్రువుల చేత పీడింప బడును. క్రమ క్రమముగా వంశము నశించును.

ఈ నైఋతి దిశకు అధిదేవత బుధుడు ఈ బుధుడు బలవంతుడైన చో గృహ యజమాని మేనమామల యెడల అభిమానము కలవాడై యుండును వాక్చాతుర్యం చేత తన కార్యము సాధించుకొనును. బుద్ధిబలము చేత మంచి వ్యాపార కుశలుడై కళల యందు కూడ అభిమానము కనబరచును.

పడమర దిశ :

ఈ పడమర దిశకు దిక్పతి వరుణుడు. ఇతడు జలాధి దేవత. ఈ పడమర దిక్పతి బలము కలవాడైనచో అనగా యింటికి పడమర దిశ యింటికి తగినకాళీకంటె అదనముగా పెరిగి యున్న యెడల ఆ యింటి యందు స్త్రీల పెత్తనము చెల్లుచుండును. పురుషులు మౌనముద్ర వహింతురు. యింటిలోని వారందరు మితిమీరి ఖర్చు చేయుచుందురు. ఆదాయము ఎంతగా వచ్చినను నిలవ వుండదు. కాని ఆ యింటి పిల్లలు చదువులందు శ్రద్ధవహింతురు

ఈ పశ్చిమ దిశకు అధిదేవత బృహస్పతి దిక్పతి సామాన్యుడైనా అధిదే వత మిక్కిలి శుభుడు. కాబట్టి వర్గారూఢమును అనుసరించి యింటికి తగి నంత పడమర కాళీస్థలము ఉన్న యెడల గృహ యజమానుడు దేహపుష్టిగలిగి ధన సంపదలతో కీర్తి మంతుడగును. ఇతరులను నొప్పింపక మాటలాడును. దాత్రుత్వము యితరులకు మేలు చేయువాడగును. రాజకీయ పరిజ్ఞానము గలిగి రాణింపగలరు. దేవబ్రాహ్మణ భక్తి కలిగి స్త్రీలు సౌభాగ్యవంతులై కీర్తిని పొంది యుందురు.

వాయువ్యము :

వాయువ్య దిశకు దిక్పతి వాయుదేవుడు. యితడు అస్థిర స్వభావము

గలవాడు. దేశసంచారి. మాట నిలబెట్టు కొననివాడు. శారీరక పుష్టి, బలవంతుడు.

ఈ వాయుదేవుడు బలవంతుడైనచో అనగా వాయవ్య దిశ యిటు పడమరకు గాని, ఉత్తరానికి గాని పెరిగియున్న యెడల ఆ గృహ యజమాని యెంత ధన సంపాదన గలిగియున్నను దేశ సంచారియై నిలకడలేక ధనవ్యయం చేస్తూ దరిద్రుడగును. అనేక యిండ్లు నిర్మించువాడగును. అందు నివశించు స్త్రీలు పిల్లలు చంచల స్వభావము కలవారై ప్రవర్తింతురు.

ఈ దిశకు అధిదేవత శని. ఈ శని బలవంతుడైనచో అనగా వాయవ్య దిశ పెరిగి యున్నచో గృహ యజమానుడు అందు నివశించువారు సోమరిపోతులగుదురు. పిల్లలు చంచల స్వభావులై చదువు సంధ్యలు రానివారై అల్లరి చిల్లరగా తిరుగుచుందురు. అకారణ కోపము కలిగి కార్యహాని కలుగ చేసుకొందురు. వీరికి గ్రామదేవతా ఉత్సవములన్న యిష్టము.

ఉత్తర దిశ :

ఈ ఉత్తర దిశకు కుబేరుడు దిక్పతి. స్థిరమైన సంపదలు గలవాడు. నవనిధులు అతనికి సొంతం. మిక్కిలి శుభఫలప్రదాత. అతని నాశ్రయించిన వారికి అష్టైశ్వర్యములు అందించే దేవత. సహృదయము గలవాడు.

ఈ ఉత్తర దిక్పతి బలవంతుడైయున్నచో అనగా ఉత్తరదిశ యింటికి తగినంత వైశాల్యము కలిగి యున్న యెడల ఆ గృహము నందు నివశించువారు మహారాజ భోగములనుభవింతురు. ప్రజలు ఆ యింటి యజమాని మాటను దైవాజ్ఞగా భావించి గౌరవింతురు. శత్రువులు కూడ మిత్రులు కాగలరు. అధికార పదవులు అతని వద్దకు వరించి వచ్చును. అష్టైశ్వర్యములను అందించు దిశ ఉత్తరదిశ మాత్రమే. ఆ దిశగృహ యజమానిని మంచి దశగలవానిగా చేయును.

ఈ ఉత్తర దిశకు అధిదైవతం చంద్రుడు. మిక్కిలి శుభఫల ప్రదాత. ఈ చంద్రుడు బలవంతుడైనచో ఈ గృహ యజమాని మనస్సు చల్లగా సర్వ జన శ్రేయస్సు కోరుచుండును. సద్గుణ సంపన్నుడు పరోపకారి ప్రజల కోరికలు తీర్చువాడగును. అందు నివశించే బాల బాలికలు తల్లి దండ్రులను పూజించే వారగుదురు. మంచి విద్యా బుద్ధులు నేర్చి వివేకవంతులై గొప్పగొప్ప ఉద్యోగాలు చేస్తూ విదేశాలకు కూడ వెళ్ళగలరు. వేయేల ఉత్తరదిశ తగినంతగా వైశాల్యము

కలిగియున్న యిల్లు నందవోద్యానమై ఆనందదాయిని అగును. అందలి సంతానము శుక్లపక్ష చంద్రుని వలె దిన దిన ప్రవర్ధమానమై వృద్ధి పొందును

ఈశాన్య దిశ :

ఈ దిశాధిపతి ఈశానుడు అనే రుద్రుడు శుభఫల ప్రదాత వంశ వృద్ధిని కలుగజేయువాడు. భోలా శంకరుడు వరప్రదాత ఈ ఈశాన్య దిశ తూర్పు ఉత్తరములకు కొలదిపాటి పెరిగియున్నచో అనగా తగినంత వైశాల్యము కలిగియున్న యెడల ఆగృహము అష్టైశ్వర్యములతో తులతూగుచుండును. ప్రజలు ఆ ఇంటి యజమానుని మాటకు కట్టుబడి యుందురు. ఆ ఇంటియందు నివశించు వారికి ఆ గృహ యజమానుని మాట వేద వాక్కు. ఆయురారోగ్య ఐశ్వర్యములు గల ఇల్లుగా నందన వనంగా ఆనంద నిలయంగా అలరారుచుండును.

ఈ ఈశాన్య దిశకు అధిదైవతము చంద్రుడు ఈ చంద్రుడు ఉత్తర దిశకు ఇచ్చే ఫలితాన్నే ఇవ్వగలడు అందుచేత ఉత్తర ఈశాన్య దిశలు రెండూ కలిసి ఉండుటయే గాక ఫలితాలను కూడా సమానంగా ఇస్తాయి. ఇంటికి ఈ ఉత్తర ఈశాన్య దిశలు తగినంతగా వైశాల్యం కలిగియుండి ఆ దిశా భాగంలో ఎత్తైన చెట్లు పాదలు లేకుండా తగినంత సూర్యరశ్మిని గ్రహించుటకు సమర్థమైనచో ఆ గృహము అష్టైశ్వర్యములతో కలకాలం కళ కళలాడుతూ వర్ధిల్లుచుండును.

గమనిక : ఈ మైమరపించిన వివరణ వాస్తు - జ్యోతిషశాస్త్రాల పరిశోధనతో మనకు లభ్యమైనది. జ్యోతిష శాస్త్రంలో భాగమే వాస్తు శాస్త్రం. జ్యోతిష శాస్త్రం లేకపోతే వాస్తు శాస్త్రం నిర్వీర్యమగును. వాస్తు శాస్త్ర సంబంధం లేకపోయినా జ్యోతిష శాస్త్రం స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుంది. కాబట్టి వాస్తు జ్యోతిష శాస్త్రాలు రెండూ అవినాభావ సంబంధాలు కలిగి వర్ధిల్లి గలవు

☆ ☆ ☆



సత్యం-శివం-సుందరం

సత్యం - శివం - సుందరం అనే ఆర్యోక్తి వేదార్థాల, నిగమాగమాల సారభూతమైనది. సత్యం సాక్షాత్తు పరమేశ్వర స్వరూపం. ఆది మధ్యాంత రహితమైన పరాశక్తి స్వరూపమే ఈ సత్యం. అట్టి పరాశక్తి యొక్క హృదయమే శివం. శివం అంటే సమస్త లోకాలను మంగళప్రదంగా చేసే భావన. సుందర మంటే అనిర్వచనీయమైన, సౌందర్య శోభా విలసితమైన, ఆపరాశక్తి స్వరూపమే జగన్మాత. పరాప్రకృతి యొక్క దర్శనీయ భౌతిక రూపమే ''సుందరము' ఈ సమస్త దృశ్యమాన జగత్తునందలి ప్రకృతి సౌందర్యాన్ని దర్శించి పరవశించిపోని ప్రాణులు ఉంటాయా? ఉండనే ఉండవు. సమస్త ప్రాణికోటిని ఆనందపరచే ఈ పంచ భూతాత్మకమైన ప్రకృతి సౌందర్యం బహు సుందరం ఆనంద వర్ధనం.

అట్టి దివ్యమైన, ఆనంద వర్ధకమైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే పంచ భూతాత్మకమైన పరాప్రకృతి యొక్క ప్రతిబింబ రూపుడే పురుషుడు. ఆదివ్య పురుషునకు వారసుడే మానవుడు. ఆ మానవుని చర్యలన్నీ మూల పురుషుడైన ఆ దివ్య పురుషుని ప్రేరణకు అనుకూలంగానే, స్పందించి ముందుకు సాగుతూ ఉండాలి. మంచి ప్రవర్తన, శీల సంపద గలవాడే మానవ జాతులలో పూర్ణ పురుషుడుగా పరిగణింప బడతాడు.

అయితే అట్టి పూర్ణ పురుష లక్షణాలు ఏ విధంగా ఉండాలి? సత్యం అనగా సత్య వాక్కు గలవాడు, శివం అనగా సర్వ కాలముల యందు లోక కళ్యాణమే పరమావధిగా గలవాడు, సుందరమనగా సమస్త శుభ లక్షణ సంపన్నుడు తన్ను దర్శించేవారి కన్నులకు చరితార్థత ఆపాదించే వాడై ఉండాలి.

ప్రాచీన భారతీయ ఋషులు తమ తమ తపశ్శక్తితో ఈనాటి సైన్సుకు మించిన వైజ్ఞానిక రహస్యాలను అవగాహన చేసి కొన్నారు. మానవ మేధా శక్తిని మానవ శక్తిని అంచనా వేసి, అందలి నిగూఢ రహస్యాలను వెలికి తీసి, వేద ఆగమ శాస్త్రాలలో గుప్త పరచారు. అట్టి అతీంద్రియ శక్తిసంపన్నులైన మన శిల్ప ఋషులు తమ తమ మేధా శక్తితో పూర్ణ పురుష స్వరూపానికి ప్రతీకగా ఊహించి వర్ణించిన స్వరూపమే వాస్తు పురుష స్వరూపం. వాస్తు పురుషుడనగా గృహ స్వరూపుడైన

గృహ పురుషుడే. మహా శక్తివంతమైన మానవ మేధస్సుతో రూపొందించిన గృహ పురుషుడు లోకకళ్యాణ కారకుడై వర్ధిల్లు చుండును.

అందుచేతనే గృహ పురుషుని, పూర్ణ పురుష స్వరూపంగా భావించి సమస్త శుభ లక్షణ సమన్వితంగా ఊహించి, సత్యం - శివం - సుందరం అనే ఆర్యోక్తికి అనుగుణంగా భావనచేసి, గృహరూపకల్పనచేయాలని వాస్తు శాస్త్రం నిర్దేశించింది. ఆ విధంగా భావనచేసి రూపకల్పన చేసిన గృహం, ఆ స్థపతి యొక్క భావనా బలంచేత యజమానికి సర్వ సౌఖ్యాలను ప్రసాదిస్తుందని మన శిల్ప ఋషుల విశ్వాసం.

చతుర్విధ పురుషార్థ సాధనకు మూలకందమైన గృహ స్వరూపాన్ని రూపకల్పన చేసే స్థపతులు, సిద్ధాంతులూ కూడ ఋషితుల్యులై ఉండాలని భారతీయ వాస్తు శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి సత్యం శివం సుందరం అనే భావనకు తమ మానసిక శక్తిని జోడించి, గృహ స్వరూపానికి రూపకల్పన చేసే వాడే నిజమైన సిద్ధాంతి కాగలడు. అతనికి లోక కళ్యాణమే పరమావధిగా ఉండాలి. అంతేగాదు, గృహ రూపకల్పనచేసేస్థపతి అనేసిద్ధాంతిగృహ నిర్మాణక్షేత్రంలో కూర్చుండి తనభావనా బలంచేత గృహ ప్రవేశసమయంలో ఆగృహ పురుషుని పరిపూర్ణ సౌందర్యాన్ని దర్శించ గలవాడై యుండాలి ఆ విధమైన భావనా పటిమ, శాస్త్ర విజ్ఞానం గల స్థపతి చేత, రూపుదిద్దుకొన్న గృహం, దర్శనీయమై, నేత్రానందకరమై, ప్రకాశిస్తుంది. ఆ ఇంటి యందు నివశించే వారికి ఆనందం అర్ణవమై ఉప్పొంగి, లోకంలో కలకాలం వర్ధిల్లుతూ ఉంటుంది.

భారతీయ వాస్తు శాస్త్రంలో వర్ణింపబడినగృహ పురుష అంగాంగ వర్ణన యెట్టిదో మనం గమనించాలి -

సమస్త నిర్మాణపు ఆకార విశేషమే, పూర్ణ పురుషుడైన గృహ పురుషుడు. ఆ గృహ పురుషుని ముఖమే ముఖద్వారం. ద్వారమునకు రెండు ప్రక్కల గల కిటికీలు నేత్రములు. చిప్ప తట్టుల యందు గల కిటికీలు కర్ణ రంధ్రాలు అనగా చెవులు. యింటికి వెనుక భాగము పృష్ఠ భాగము అనగా వీపు. సింహ ద్వారమునకు ముందుగల ఖాళీ స్థలము (ముంగిలి) గృహపురుషుని ఊపిరి తిత్తులు. గర్భగృహము గృహ పురుషుని గర్భము. స్తంభములు పాదములు, వెన్ను వాసము గృహ పురుషుని వెన్నుదండి. సాధారణ మానవుడు యేవిధంగా పంచ భూతాల కలయిక చేత రూపుదిద్దుకుంటాడో, గృహ పురుషుడు కూడా పంచభూతత్మకమైన పదార్థాల చేతనే రూపుదిద్దుకుంటాడు.

గమనించండి :

గృహ పురుషుడు అనే యింటికి, చుట్టూరాగల ప్రహరీ గోడ శరీర రక్షక కవచం అనే చర్మం. ఆ ప్రహరీ గోడ లోతట్టునగల కాళీ ప్రదేశం, ఆకాశ భూతానికి చెందినది. గృహ నిర్మాణానికి ఉపయోగించిన ఇటుకలు, సున్నం, సిమెంటు, కలప మొదలైన పదార్థాలు, పృధివీ తత్వానికి చెందినవి. నీటి కుళాయిలు నూతులు నీటి కుండీలు మొదలైనవి జలతత్వానికి చెందినవి. గర్భ గృహ వైశాల్యం, ఎత్తు తెరిచి వుండే వరండాలు, మొదలైనవి గూడ ఆకాశతత్వానికిచెందినవి ఇక వంట యిల్లు, అందలి పాయ్యిలు, దీపస్థలాలు మొదలైనవి అగ్నితత్వానికి చెందినవి. గుమ్మాలు, కిటికీలు మొదలైన వాయు ప్రసార సాధనాలు, వాయుతత్వానికి చెందినవి. గృహ పురుషుడు ఈ విధంగా పంచ భూతాత్మకమైన అయిదు తత్వాలను తనలో యిముడ్చుకొని పూర్ణ పురుషుడై చైతన్యవంతుడై ప్రకాశిస్తూవుంటాడని శాస్త్రాలు చెపుతూ వున్నాయి.

ఇంత వరకు గృహ పురుషవర్ణన చేశాం. మరి ఆ గృహ పురుషునికి పిండోత్పత్తికాలం యెప్పుడౌతుందో కూడా మనం గమనించాలి. మానవ శిశువునకు పిండోత్పత్తి కాలం ఉంది కదా, ఆ విధంగానే శంకుస్థాపన సమయము గృహ పురుషుని పిండోత్పత్తి కాలం అని శాస్త్రాలు చెపుతున్నాయి. మండపారాధన వాస్తు పురుషారాధన జరిపి, స్థపతి శంకువు లేక ప్రధమేష్టి కాన్యాసాల కాలంలో, గృహ పురుషునికి ప్రాణ ప్రతిష్ట, చైతన్య ప్రసారం చేస్తాడు. ఆ భావనా బలమే యింతింతై సంపూర్ణ గృహ స్వరూపంగా రూపు దిద్దుకుంటుంది. ఆ పిమ్మట గృహ నిర్మాణం పూర్తి అయిన తర్వాత, గృహ ప్రవేశ సమయానికి ముందురోజు రాత్రి, సమర్థుడైన స్థపతి తన భావనా బలం చేత గృహ పురుషునిలో చైతన్య ప్రసారం చేసి, వాస్తు పురుష మండపారాధన జరిపి, ప్రాణ ప్రతిష్ట చేసి, షోడశ కళలను అందు నిక్షిప్తం చేస్తాడు.

ఆ విధంగా స్థపతి, ఆ గృహపురుషునిలో పరాశక్తి ప్రతీకాలైన సత్యం, శివం, సుందరం అనే భావాత్మకమైన శుభ లక్షణాలను న్యాసం చేస్తాడు. ఆ మరునాడు శుభముహూర్తాన దంపతులు వాస్తు పురుషుని పూజించి నవగ్రహారాధన, బ్రహ్మ మండపారాధన చేసి, నూతన గృహ ప్రవేశం చేస్తారు. ఆ విధంగా గృహ పురుష స్వరూపం, షోడశ కళాప్రపూర్ణమైన పున్నమినాటి చంద్రుని వలె ప్రకాశిస్తుంది.



ఈ సమస్త చరాచర జగత్తునందంతట ప్రత్యణువు నందు అవిచ్ఛిన్న ముగ పరివ్యాప్తి చెంది యున్న ఆ పరాశక్తి స్వరూపమే చైతన్యం. ఆ దివ్యచైతన్య శక్తి ప్రకృతి శక్తిగా రూపాంతరంచెంది కాలచక్రం అనే సాధనతో ఈ శింశుమార చక్రాన్ని గిరగిరా త్రిప్పుతూ, సూర్య, చంద్ర, నక్షత్ర గ్రహ తారకా సముదాయాన్ని క్రమం తప్పకుండా చలింపజేస్తూ జీవరాసుల మనుగడకు దోహదం చేస్తున్నది.

ఈ సృష్టియందలి ప్రతి పదార్థంలోను అంతర్గతంగా ఉన్న ఆ చైతన్య శక్తి ఆయా పదార్థాల యొక్క ఆకార ప్రకారాలకు తగిన ప్రమాణంలో ఆవరించి వుంటుంది. ఆ చైతన్య శక్తి యొక్క ప్రభావం చేత, ఆయా పదార్థాల నుండి, ఆయా పదార్థాల ఆకార ప్రమాణాలకు తగిన విధంగా, కిరణ ప్రసారం జరుగుతూ ఉంటుంది. ఆ కిరణాలు మన కంటిలోని రెటీనా అనే కంటిపాపకు తాకగానే, ఆ వస్తువును మనం గుర్తించ గలుగుతాం. ఈనాటి వైజ్ఞానికులంతా దీనిని ధృవీకరిస్తున్నారు.

అయితే, పదార్థం నుండి వెలువడే కిరణాలు అనగానే సూర్య కిరణాల వలెనో, చంద్ర కిరణాల వలెనో ఉంటాయి అనుకోకూడదు కాంతి అంటే మనం మామూలుగా అనుకొనే తెల్లని వెలుగే కాదు. పదార్థం నుండి వెలువడే కిరణాలకు ఏవిధమైన రంగు ఉండకపోవచ్చు. ఏ పదార్థమైన మన దృష్టిగోచరం అవుతున్నదంటే, ఆ పదార్థం నుండి కిరణ ప్రసారం జరుగుతున్నదన్నమాట.

కాబట్టి, చరాచర జగత్తు నందలి ప్రతి పదార్థం, తన స్థాయికి తగినంత చైతన్యం కలిగి యుంటుందని గమనించాం. అయితే ఈ చైతన్యం మనుషులలో అధికంగా ఉంటే జంతువులలో కొంత తగ్గి వుంటుంది. చెట్లు, పాదలు, లతలు, తీగలు, ఫల పుష్పాలలో యింకా తక్కువగా ఉంటుంది. మొత్తం మీద పిపీలికాది బ్రహ్మపర్యంతం, ఈ చైతన్యం ఆశ్రయించి ఉంటుంది.

చెట్లు పాదలు, లతలు, తీగలు, ఫల పుష్పాలలో కూడా చైతన్యం ఉందని వీటికి కూడా మానవులవలె సుఖ దుఃఖాలు ఉన్నాయని, డా. జగదీశ్ చంద్రబోసు వైజ్ఞానిక పద్ధతిలో బుజువుపరచారు. పై విషయాలు అవగాహన చేసుకొంటే సృష్టిలో ఆకార విశేషానికి చాలాప్రాముఖ్యముంది. అందుకే పెద్దలంటారు- ''ఒక్కో ముఖం చూస్తే పెట్టబుద్ధి, ఒక్కో ముఖం చూస్తే కొట్టబుద్ధి'' అని అందుకు కారణాలు ఆయా వ్యక్తుల యొక్క ముఖారవిందాలు విడుదల చేసే ఆకర్షణ వికర్షణ శక్తులటువంటివని పిండితార్థం. అందుచేతనే, మనకు కొన్ని వస్తువులను చూడగానే హృదయాంతరాళము నుండి ఆనందము పెల్లుబుకుతుంది. ఆ ఆనంద తరంగాల తాకిడికి మన శరీర యంత్రాంగం ప్రతిస్పందించి, అనేక జీవ రసాయనిక ప్రకియలకు లోనై, కాంతి కిరణాలను విడుదల చేస్తుంది. ఆ కాంతి కిరణాలు, ఆ వ్యక్తి చుట్టూ కాంతి వలయంగా రూపుదిద్దుకొంటాయి. ఆ కాంతివలయమే '' ఆరా''గా యేర్పడుతుంది. అరా అనగా ప్రతి పదార్థానికి చుట్టూరాయేర్పడి ఉండే జీవకాంతి. ఈ జీవకాంతినే వైజ్ఞానికులు ''ఆరా'' అని పిలుస్తారు. ఈ జీవ కాంతిని మనం మామూలు కంటితో మాత్రం చూడలేం. కానీ యోగులు, ఈ కాంతిని స్పష్టంగా చూడగలరు. బౌద్ధ సాహిత్యంలోనూ, థియసాఫికల్ సాహిత్యంలోనూ ఇంకా చైనా, టిబెట్ మొదలగు దేశాలలోను, బౌద్ధ పండితుల ద్వారాను ''ఆరా'' గురించి విపులమైన వర్ణనలున్నాయి. అందుకు సాక్ష్యంగా మన భారతీయ దేవతల యొక్క చిత్రాలలో, దేవతల-తలల చుట్టూరా గుండ్రని కాంతి వలయం చిత్రించ బడుతూ వస్తుంది.

ఈ జీవకాంతి, మానవునిచుట్టూ ఆ పాదమస్తక పర్యంతము అండాకారంగా వ్యాపించి యుంటుందని, థియసాఫికల్ వారి సాహిత్యంలో వర్ణించబడినది. ఆయా వ్యక్తుల గుణగణాలకు అనుగుణంగా కాంతిలో భేదం ఉంటుంది. రోగగ్రస్తులైన వారి ''ఆరా''లో నల్లని చారలు ఏర్పడతాయి. ఆరోగ్యవంతుని ''ఆరా'', లేత గులాబీ రంగులో కాంతులు విరజిమ్ముతుందని వ్రాయబడి ఉంది.

ఈ ఆరా, జడపదార్థాలకు కూడా ఉంటుందని గదా మనం చదివాం జడపదార్థాల ''ఆరా'' బలహీనంగా ఉంటుంది. కారణం ఏమంటే, ఆ జడపదార్థాల యందలి చైతన్య ప్రమాణం తక్కువ కావడమే.

ఈ ఆరా గురించి అనేకమంది ఆధునిక శాస్త్రవేత్తలు కూడా, వైజ్ఞానిక పద్ధతిలో పరిశోధించి నిర్ణయించారు. రష్యాలో ప్రముఖ పారా సైకాలజిస్ట్ డా. కిర్లియన్, అతని సహాయకుడు పెమియన్ అనే శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేసి, వస్తువులలో గల ఈ ఆరాను ఫొటోలు తీయగలిగారు. అంతేగాక ఈజిప్షియన్, గ్రీక్, రోమన్, భారతీయ సాహిత్యాలలో ఈ 'ఆరా' అనబడే జీవకాంతి గురించి ప్రస్తావనలున్నట్లు తెలియ వస్తున్నది.

ఈ పై విషయమంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే అనేక పదార్థాల సమ్మేళనంతో రూపుదిద్దుకొని, సర్వాంగ సుందరంగా కనిపించే ఇంటికి కూడ 'ఆరా' సిద్ధాంతం వర్తిస్తుంది. గృహ నిర్మాణంలో అనేక పదార్థాలు వినియోగిస్తాము. ఆయా పదార్థాలు విడుదల చేసే కాంతి కిరణాలు సమ్మిళితమై, ఈ 'ఆరా' రూపుదిద్దుకొంటుంది. ఈ 'ఆరా' యొక్క స్వభావము యింటికి ఉపయోగించిన ఆయా పదార్థాల గుణగణాలకు అనుగుణంగా ఉంటుంది. కాబట్టి మన శిల్ప ఋషులు యేయే పదార్థాలు ఇండ్లకు వినియోగించాలో ఆయా పదార్థాలను మాత్రమే వినియోగించవలెనని నిర్దేశించారు. నిషేధింపబడిన పదార్థాలను గృహ నిర్మాణంలో ఎంత మాత్రం వినియోగించరాదు.

☆ ☆ ☆

ఆకారంలో అద్భుత శక్తులు

పంచ భౌతికమైన సజీవ ఆకార విశేషానికి చాలాప్రాముఖ్యత ఉందని ''ఆరా'' ప్రకరణంలో గుర్తించాము. ఇది పంచ భౌతికమే అయినా, నిర్జీవ జడపదార్థాల సమ్మేళనంతో రూపుదిద్దుకున్న ఆయా కట్టడాలకు, ఈ ఆరా సిద్ధాంతం వర్తిస్తుందా? వర్తిస్తుందనే జవాబు.

గృహం, సజీవమైన నిర్జీవమైన పంచ భౌతిక అణు సముదాయాల కూడికతోనే రూపొందింపబడుతుంది. ఏదైనా ఒక నిర్మాణాన్ని ఉదాహరణగా తీసుకొనండి. ఆ నిర్మాణం యొక్క ఎత్తు, రంగు, రూపం, ఆ నిర్మాణంలోవల గల వైశాల్యం ఆ నిర్మాణంలో ఉపయోగించే ఇటుకలు, సున్నం,కలప ఇంకా అనేక విధాలైన పదార్థాల సమ్మేళనం, ఆయా పదార్థాలు విడుదల చేసే కాంతి తరంగాల కలయికచేత జరిగే రసాయనిక చర్యలు, ఆయా జీవ రసాయనిక చర్యల వల్ల విడుదలయ్యే కాంతి తరంగ సమ్మేళనం, మొదలైన సామూహిక ప్రభావంచేత ఆ కట్టడానికి ''ఆరా'' రూపుదిద్దుకుంటుంది. ఈ ఆరాను మన భౌతిక నేత్రాలతో చూడలేము గనుక ''ఆరా'' లేదనుకోవడం పొరపాటు.

ఈజిప్టు అతి ప్రాచీన దేశం. ఆ దేశంలో ''పిరమిడ్లు'' అనే ప్రాచీన కట్టడాలున్నాయి. ఇవి ఎన్నో వేల ఏండ్లకు పూర్వం నిర్మింపబడి ఉన్నాయి ఈ కట్టడాలు ఖచ్చితమైన ఉత్తర దక్షిణదిశలకు అనుగుణంగా నిర్మించారు. ఈ కట్టడాలు, ఈనాటి విజ్ఞాన శాస్త్రానికి అందుబాటులో లేని అతీతమైన విజ్ఞాన సూత్రాలనుపయోగించి నిర్మించబడినవని ''విలియం పెట్రీ'' అనే శాస్త్రవేత్త అంటారు. ఆయా పిరమిడ్ల ''ఆకృతి'' ఎలక్ట్రోమేగ్నటిక్ తరంగాలను, రోదసి నుండి విడుదలయ్యే కాస్మిక్ కిరణాలను, మన వైపునకు ఆకర్షించు కొనే శక్తి కలిగియున్నదని ''చెక్'' దేశపు కారిల్ డ్రాబర్ అభిప్రాయ పడుతున్నారు.

యూరోపియన్ అతీంద్రియ పరిజ్ఞాన సంస్థవారుకూడా ''పిర

మిడ్'' లో, అట్టి అపూర్వ శక్తి పిరమిడ్స్ యొక్క ఆకృతి, నిర్మాణ దిశను బట్టి ఏర్పడుతుందని అభిప్రాయపడుతున్నారు. అంతేగాదు, ఆయా నిర్మాణములు ఏయే పదార్థాలతో నిర్మింపబడినవో, ఆయా కట్టడాలు ఆయా పదార్థాల లక్షణాలను ప్రదర్శిస్తాయని నిర్ధారించారు

ఈ విధమైన వైజ్ఞానిక దృష్టితో పరిశీలించి చూస్తే మన వాస్తు గ్రంథాలు ''మయమతం'', ''మానసారం'', ''సమరాంగణం'', మొదలైనవాటియందు వివరింపబడిన దుర్గ, సౌధ, హర్మ్య, భవనాది నిర్మాణ విశేషాలు ఎటువంటి కట్టడానికి ఎన్ని శిఖరాలు, ఎన్ని కలశాలు ఉండాలి మొదలైన అనేక విషయాలు చర్చించబడ్డాయి. ఈ ఆకృతులు నిర్మాణ సూత్రాలకు అనుగుణంగానే ఉన్నాయని అభిప్రాయం ఏర్పడుతుంది.

విశ్వకర్మ వాస్తుశాస్త్రం లోను మయమత వాస్తు శాస్త్రం లోనూ ప్రాసాద సౌధ, హర్మ్య, భవన నిర్మాణ శైలి మిక్కిలి విస్తారంగా వివరింపబడింది. ఆయా నిర్మాణాలలో, ఫలానా పదార్థమే ఉపయోగించాలి ఫలానా కలపనే వినియోగించాలి, ఫలానా చెట్ల కలపను వినియోగించ రాదు అని ఖచ్చితంగా నిర్దేశించిన, భారతీయ శిల్ప ఋషుల పదార్థ విజ్ఞాన మెంత అనుభవపూర్వకమైనదో గ్రహించాలి. ఇదంతా ఎందుకు వివరింపబడుతుందంటే మన శాస్త్రాలలోని రహస్యాలను ఏ విదేశీయ ప్రముఖుడో మనకు తెలియ చెప్పేంత వరకు మనం నమ్మలేనంత అజ్ఞానానికి దిగజారిపోయాం

కాబట్టి ఇప్పటికైనా విజ్ఞానులైన పండితులు, ప్రభుత్వాలు ఈ నగ్న సత్యాన్ని గుర్తించి భారతీయ వాస్తు శాస్త్ర పరిశోధనకు పూనుకోవాలి భారతీయ వాస్తు శాస్త్రాలను ఇంజనీరింగు కళాశాలలలో అధ్యయనం చేయవలసిన దిగా పాఠ్య ప్రణాళికలు రూపొందించాలి.

❋ ❋ ❋

గ్రహబలం - గృహబలం

ఈ ప్రకరణంలో గ్రహబలం గొప్పదా? గృహబలం గొప్పదా? అనే విషయం చర్చనీయాంశము. ఆధునిక వాస్తు పండితులు చాలా మంది, గృహ బలం చాలా ముఖ్యమని, మానవుల సుఖదుఃఖాలకు ఇల్లే మూల కారణమని మిక్కిలిగా ప్రచారం చేస్తున్నారు. ఈవాదం ఎంత వరకు సత్యం? అనే విష యాన్ని ఈ ప్రకరణంలో పరిశీలిద్దాం.

తర తరాలుగా భారతీయుల ఖగోళ విజ్ఞానం మంచి అభివృద్ధిని సాధిం చింది. కాలక్రమంలో ఖగోళశాస్త్రం ఆధారంగా జ్యోతిషశాస్త్రం ఆవిర్భవిం చింది. ఖగోళవిజ్ఞానానికి ''మయబ్రహ్మ'' విరచితమైన ''సూర్య సిద్ధాంతం'' అనే గ్రంధం పరమ ప్రామాణికం. నేటికీ కూడా ఈ సూర్య సిద్ధాంతం ఆధారం గానే పంచాంగ రచన సాగుతూ ఉంది. ఈ పంచాంగం ఆధారంగా గ్రహ గతులను పరిశీలించి, మానవజాతి యొక్క మంచి చెడులను, శుభా శుభ ఫలితాలను, మమమ్యని భవిష్య జీవన విధానాన్ని తెలియజేసేదే జ్యోతిష శాస్త్రం. మాన వుడు పుట్టిన సమయం ఆధారంగా మానవ జీవన గమనాన్ని జ్యోతిషం విశదీ కరిస్తుంది. అట్టి జ్యోతిష శాస్త్రాలలో బృహత్పరాశరహోరా శాస్త్రం, కాలా మృతం, ఉత్తర కాలామృతం, సారావళి మొదలైన గ్రంథాలు సుప్రసిద్ధాలు. ఆయా గ్రంధాల ఆధారంగా, శిశువు పుట్టిన సమయాన్ని ప్రాతిపదికగా తీసి కొని, జన్మకుండలి తయారుచేసి, అందలి గ్రహస్థితిని పరిశీలించి భూత, భవిష్యత్, వర్తమానాలను చెప్పడం భారతీయ పండితులకు ఉగ్గు పాలతో అబ్బిన విద్య. ఈ విధంగా, ఖగోళ గ్రహసంచారం మానవుల మీద ఏ విధంగా ప్రభావం చూపుతుందో జ్యోతిషశాస్త్రం వివరిస్తుంది. జ్యోతిషశాస్త్రంలో వాస్తు, ఒక శాఖమాత్రమే. వాస్తు శాస్త్రం జ్యోతిష శాస్త్రం ఆధారంగా ముహూర్తాది అంశాలను గ్రహిస్తుంది. వాస్తు శాస్త్రానికి గల కొన్ని మౌలిక అంశాలు ప్రత్యేకాంశాలుగా ఉన్నాయి. ఈ మౌలికాంశాల ఆధారంగా, వాస్తు శాస్త్రం గృహ బలాన్ని విశదీకరిస్తుంది.